ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ **కోనసీమ** జిల్లా వార్తలు

గురువారం 24 జూలై 2025 | 5

దళితుడిపై అమానుష దాడి కేసులో..

ముగ్గురి అరెస్ట్, పరారీలో మరో ముగ్గురు : అమలాపురం డీఎస్పీ

మూడేళ్ల బాలుడి మృతి కేసులో..

అంగన్వాడీ కార్యకర్త, ఆయాకు జైలు

పల్లంకుర్రు పంచాయతీ మొక్కలతిప్పలో ఉదంతం 7



కమిటీ సభ్యుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్, ఎమ్మెల్యే వరప్రసాద్

పల్లిపాలెం మినీ ఫిషింగ్ హార్బరు పూర్తిస్థాయి నిర్వహణకు కార్యాచరణ : కలెక్టర్

అమలాపురం, జూలై 23(ఆంధ్రజ్యోతి): అంతర్వేది పల్లిపాలెంలో మినీ ఫిషింగ్ హార్బరు పూర్తిస్థాయిలో నిర్వహణ చేపట్టేలా కార్యాచరణ రూపొందించినట్టు రాజోలు ఎమ్మెల్యే, విశ్రాంత ఐఏఎస్ దేవ వరప్రసాద్, కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పేర్కొన్నారు. 14 మంది కమిటీ సభ్యులతో మినీ ఫిషింగ్ హార్బరు నిర్వహణ తీరుపై కలెక్టర్ మహేష్‌కుమార్ అధ్యక్షతన బుధవారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. తొలుత ఎమ్మెల్యే వరప్రసాద్ మాట్లాడుతూ మినీ హార్బరుకు నీటి వసతికోసం రూ.30 లక్షల అంచనా వ్యయంతో ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మించి పైపులైన్ల ద్వారా సరఫరా చేయాల్సి ఉందన్నారు. నరేగా అనుసంధానంతో మినీ హార్బరుకు వెళ్లే అప్రోచ్ రోడ్డును మెటీరియల్ కాంపోనెంట్ కింద రూ.20 లక్షల అంచనా వ్యయంతో సీసీ రోడ్డు నిర్మించనున్నట్టు కలెక్టర్ తెలిపారు. పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తే రోజువారీగా 200కు పైబడి పడవలు రాకపోకలు సాగించి చేపల ఉత్పత్తి, ఎగుమతి, దిగుమతుల లావాదేవీలు జరిగి మత్స్యకారుల జీవనోపాధి మెరుగుపడుతుందన్నారు. ప్రతీరోజు మినీహార్బరు నుంచి సింగపూర్, బెంగళూరు, గోవా, హైదరాబాద్, ముంబై, కేరళకు చేపల ఉత్పత్తులు ఎగుమతి అవుతాయన్నారు. విద్యుత్ సరఫరాకు రూ.19.50 లక్షల అంచనా వ్యయంతో రెండు కిలోమీటర్ల మేర ఎల్టీ లైన్ నిర్మించడానికి ప్రతిపాదనలు రూపొందించామన్నారు. చేపల వేటకు సంబంధించి మత్స్యకార పడవలకు రాయితీతో కూడిన పెట్రోలు బంకులు ఏర్పాటుకు ఏజన్సీ ముందుకు వచ్చిందన్నారు. హార్బరుకు రాకపోకలు సాగించే పడవల బెర్తింగ్ చార్జీలు, షాపుల అద్దెలు వంటి అంచనాలను రూపొందించామన్నారు. జిల్లాలో మెకనైజ్డ్ బోట్ల కమ్యూనికేషన్ నిమిత్తం 62 ట్రాన్స్‌పాండర్స్ ఏర్పాటుచేశామన్నారు. సెక్యూరిటీ నిర్వహణ, ఆపరేషన్, క్యాంటీన్ వంటి అంశాలకు సంబంధించిన పెట్టుబడుల రూపకల్పన జేసీ రూపొందిస్తారన్నారు. సమావేశంలో జేసీ టి.నిషాంతి, ఆర్డీవో కె.మాధవి, మత్స్యశాఖ జేడీ శ్రీనివాసరావు, ఏడీ వర్ధన్, ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ పద్మనాభం, ఎస్ఐ శాస్త్రి, సర్పంచ్ ఒడుగు శ్రీనివాస్, బోటు ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్తిరాజు, నరసింహస్వామి పాల్గొన్నారు.

నూతన వసతిగృహాల నిర్మాణానికి సహకరించాలి

కేంద్రమంత్రిని కోరిన ఎంపీ హరీష్‌బాలయోగి



వీరేంద్రకుమార్‌ను కలిసిన ఎంపీ హరీష్‌బాలయోగి

అమలాపురం, జూలై 23(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లాలో ప్రధానమంత్రి అనుసుచిత్ జాతి అభ్యుదయ యోజన (పీఎంఏజేఏవై) కింద విద్యార్థులకు వసతిగృహాలు నిర్మించేందుకు సహకరించాలని కేంద్ర సామాజికన్యాయం, సాధికారిత శాఖ మంత్రి డాక్టర్ వీరేంద్రకుమార్‌ను అమలాపురం ఎంపీ గంటి హరీష్‌బాలయోగి కోరారు. ఢిల్లీలోని మంత్రి కార్యాలయంలో బుధవారం ఆయనను కలిసి శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ భవనాలు, అద్దె ప్రాంగణాల్లో అసౌకర్యాల నడుమ వసతిగృహాలు ఉన్నాయని, అవి కూడా విద్యార్థులకు సరిపోవడంలేదని కేంద్ర మంత్రికి వివరించారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు మొత్తం 11 హాస్టళ్ల నిర్మాణంకోసం గుర్తించారని, కోనసీమ ప్రాంతంలోని ఎస్సీ విద్యార్థుల సంక్షేమానికి ఈ హాస్టళ్లు కీలకమని ఆయన చెప్పారు. నాలుగు వసతిగృహాలకు నేరుగా ప్రతిపాదనలు అందించడంతో వాటిని పీఎం అజయ్ పోర్టల్ కింద అప్‌లోడ్ చేసినట్టు మంత్రికి ఎంపీ హరీష్ వివరించారు. కాగా ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సహకారంతో విద్యార్థులకు అవసరమైన కొత్త హాస్టళ్ల నిర్మాణానికి త్వరలోనే ఆమోదం లభించేలా కృషి చేస్తానని ఎంపీ హరీష్ తెలిపారు.

సాధికారితపై శ్రద్ధ చూపాలి..

కేంద్ర సామాజిక న్యాయం, సాధికారిత మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో విద్యా, నైపుణ్యాభివృద్ధి ద్వారా ఎస్సీ వర్గాలకు సాధికారిత కల్పించడం లక్ష్యంగా అనేక ముఖ్య పథకాల్లో కోనసీమ జిల్లాపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆ శాఖ మంత్రి వీరేంద్రకుమార్‌ను కోరినట్టు ఎంపీ హరీష్‌బాలయోగి తెలిపారు. అంబేడ్కర్ సోషల్ ఇన్నోవేషన్ అండ్ ఇంక్యుబేషన్ మిషన్ కింద రాష్ట్రం నుంచి ఏ స్టార్టప్‌లు, ఇన్నోవేటర్లను ఎంపిక చేయలేదని కేంద్రమంత్రికి వివరించారు. శ్రేష్ఠ పథకం కింద జిల్లాలోని ఏ విద్యాసంస్థలను చేర్చలేదని, దీంతో అర్హులైన ఎస్సీ విద్యార్థులు రెసిడెన్షియల్ పాఠశాల అవకాశాలను పొందలేకపోయారన్నారు. ఎస్సీ వర్గాల సాధికారితపై దృష్టి సారించాలని హరీష్ కోరారు.

పేదరికం లేని సమాజమే పీ4 ప్రధాన లక్ష్యం : కలెక్టర్



వక్కలంక గ్రామసభలో మాట్లాడుతున్న కలెక్టర్

అంబాజీపేట, జూలై 23(ఆంధ్రజ్యోతి): పేదరికం లేని సమాజమే పీ4 ప్రధాన లక్ష్యమని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అన్నారు. అంబాజీపేట మండలం వక్కలంక పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ వాసంశెట్టి రేవతిపెదబాబు అధ్యక్షతన జరిగిన గ్రామసభలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. 20 మంది నిరుపేదలను గుర్తించి వారి బంగారు భవిష్యత్‌ను తీర్చిదిద్దే విధంగా సమాజంలో ఆర్థిక అసమానతలను రూపుమాపే యజ్ఞాన్ని రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. గ్రామంలో సర్వే ద్వారా 64 మంది బంగారు కుటుంబాలను గుర్తించామని, రీవాల్యుడేషన్ సర్వేలో ఆ జాబితాలో 31 మంది అనర్హులుగా తేలిందన్నారు. మిగిలిన 33 మందిలో ఇద్దరు మరణించడం జరిగిందని, మిగిలిన 31 మంది అర్హులతోపాటు రీవాల్యుడేషన్ సర్వేలో మరో 17 మంది బంగారు కుటుంబాలను ఎంపిక చేయడం జరిగిందన్నారు. గ్రామంలో మొత్తం 48 మంది బంగారు కుటుంబాలను గుర్తించినట్టు వెల్లడించారు. గ్రామంలో అత్యంత ధనికులైన 10 శాతం మంది మార్గదర్శకులను గుర్తించి బంగారు కుటుంబాలకు దత్తతనిచ్చేలా ఈ వేదికలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం ఏర్పాటుచేసిన బంగారు కుటుంబాలను గుర్తించి వారికి సహకరించాలని, పీ4 విజయవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. పేదరిక నిర్మూలను ప్రభుత్వ లక్ష్యమని ప్రతి సచివాలయ పరిధిలో బంగారు కుటుంబాలను గుర్తించే గురుతర బాధ్యత సచివాలయ ఉద్యోగులపై ఉందన్నారు. సచివాలయ ఉద్యోగులు ప్రజల్లోకి విస్తృతంగా ఈ పథకాన్ని తీసుకువెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు చినబాబు, సీపీవో మురళీకృష్ణ, పంచాయతీ కార్యదర్శి తాతాజీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై అపోహలు వద్దు.. అదనపు చార్జీలు ఉండవు : ఎస్ఈ రాజేశ్వరి

అమలాపురం, జూలై23(ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపులో ఎటువంటి అపోహలు అవసరం లేదని, వీటివల్ల వినియోగదారులపై ఎలాంటి అదనపు చార్జీల భారం ఉండదని ఏపీఈపీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ బి.రాజేశ్వరి స్పష్టం చేశారు. విద్యుత్ వినియోగదారుల సేవల్లో పారదర్శకతను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం ఆర్డీఎస్ఎస్ పథకంలో భాగంగా అన్ని రాష్ట్రాల్లో స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ప్రారంభించిందని, అందుకు అనుగుణంగా ప్రస్తుత మీటర్ల స్థానంలో స్మార్ట్ మీటర్లతో మార్చాలనే ప్రతిపాదనకు 2021 ఫిబ్రవరిలో ఏపీఈఆర్సీ ఆమోదం తెలిపిందన్నారు. ప్రభుత్వ, వాణిజ్య కేటగిరిల వినియోగదారులకు వీటిని బిగిస్తామన్నారు. వీటితోపాటు ఎక్కువ విద్యుత్ వినియోగం కలిగిన గృహ వినియోగదారులకు కూడా అమరుస్తామన్నారు. స్మార్ట్ మీటరు ఏర్పాటు సమయంలో వినియోగదారుల నుంచి ఎటువంటి అదనపు చార్జీలు వసూలు చేయరని చెప్పారు. వీటికారణంగా బిల్లులు పెరిగే ప్రసక్తి ఉండదన్నారు. టారిఫ్ ప్రకారమే విద్యుత్ బిల్లులు వస్తాయన్నారు. స్మార్ట్ మీటరు ఏర్పాటుకు సంబంధించిన సందేహాల నివృత్తికోసం వినియోగదారులు టోల్‌ఫ్రీ నంబరు 1912ను సంప్రదించవచ్చని ఎస్ఈ తెలిపారు.



అల ఆనందపురం!

స్పందించారు.. పెంచారు

మునిసిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, పురపాలక శాఖ మంత్రి నారాయణ స్పందించి వేతనాల పెంపుదలకు అంగీకరించారు. కేటగిరి-1 అవుట్‌సోర్సింగ్ కార్మికుల వేతనాలను రూ.21,500 నుంచి రూ24,500కు, కేటగిరీ-2లో 18,500 నుంచి 21,500కి, కేటగిరి-3లో 15,000 నుంచి 18,500కి పెంచారు. వేతనాల పెంపు వల్ల కలిగే అదనపు భారాన్ని ఆయా కార్పొరేషన్లు, మునిసిపాలిటీలు, నగర పంచాయతీలు తమ నిధులు నుంచి భరించాల్సి ఉంటుంది.

పుర కార్మికుల జీతాలు పెంపు

- 20 ఏళ్ల తరువాత పెంపుదల
- ఒక్కొక్కరికి రూ.3,500 లబ్ధి
- 730 మంది కార్మికుల ఆనందం
- అవుట్‌సోర్సింగ్ వర్కర్ల హర్షం
- మరో హామీ నెరవేర్చిన సర్కారు

పట్టణాలు, నగరాల్లో పనిచేస్తున్న ఇంజనీరింగ్ సహా వివిధ విభాగాల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ కార్మికులకు కూటమి ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. మూడు కేటగిరిల్లో ఉన్న వర్కర్ల వేతనాలను రూ.3,500 చొప్పున పెంచి జీవో జారీ చేయడంపై కార్మికుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

(పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని కార్పొరేషన్లు, మునిసిపాలిటీలు, నగర పంచాయతీల్లో కీలకమైన ఇంజనీరింగ్ విభాగంతోపాటు వాటర్ వర్క్స్, వీధి దీపాల నిర్వహణ, కంప్యూటర్ విభాగాల్లో అవుట్‌సోర్సింగ్ కార్మికులు పనిచేస్తున్నారు. ఈ విభాగాల్లో రెగ్యులర్ ఉద్యోగుల కంటే వీరి సంఖ్యే అధికం. తాగునీటి సరఫరా, స్ట్రీట్ లైటింగ్ తదితర అంశాలపై ప్రజలకు మెరుగైన సేవలందడంలో వీరు కీలకపాత్ర పోషిస్తున్నారు. కొంతకాలంగా వీరి వేతనాలు పెరగలేదు. పారిశుధ్య కార్మికుల వేతనాలు పెంచినా ఇంజనీరింగ్ విభాగాల్లో పనిచేస్తున్న వారి వేతనాలను గత వైసీపీ ప్రభుత్వం పెంచలేదు. తమ వేతనాలు పెంచాలంటూ వీరు కొంతకాలంగా డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉండగా తెలుగుదేశం కూటమి నాయకులు గత ఎన్నికల సమయంలో వీరి వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చారు. అయితే కూటమి ప్రభుత్వం కొలువు తీరిన తర్వాత జీతాల పెంపుతోపాటు ఇతర డిమాండ్లపై తగిన స్పందన లభించకపోవడంతో ఇటీవల ఆందోళనబాట పట్టారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ఇంజనీరింగ్ వర్కర్లు పిఠాపురంలో భారీ ప్రదర్శన జరపడంతోపాటు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ క్యాంపు కార్యాలయంలో వినతిపత్రాలు అందించారు.

మంత్రివర్గ ఉపసంఘం సిఫారసు

అప్కాస్ (ఏపీ అవుట్‌సోర్సింగ్ కార్పొరేషన్)పై నియమించిన మంత్రివర్గ ఉపసంఘం వీరి డిమాండ్లను పరిశీలించి వేతనాలు పెంచాలని సిఫారసు చేసింది. దీనికి ప్రభుత్వం అంగీకరించి ఇంజనీరింగ్ విభాగాల్లో పనిచేస్తున్న నాన్ పీహెచ్ వర్కర్లకు తదుపరి కేటగిరి వేతనాలు వర్తింపజేయడం ద్వారా రూ.3,500 వరకూ పెంపుదల చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుతం ఇంజనీరింగ్‌తో సహా వివిధ విభాగాల్లో ఉన్న మూడు కేటగిరీల నాన్ పీహెచ్ వర్కర్లకు వేతనాల పెంచడంతో హర్షం వ్యక్తంచేస్తున్నారు.

730 మంది కార్మికులు

కాకినాడ జిల్లాలో కాకినాడ కార్పొరేషన్, పిఠాపురం, పెద్దాపురం, తుని, సామర్లకోట మునిసిపాలిటీలు, గొల్లప్రోలు, ఏలేశ్వరం నగర పంచాయతీలు, తూర్పుగోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరం కార్పొరేషన్, కొవ్వూరు, నిడదవోలు మునిసిపాలిటీలు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అమలాపురం, రామచంద్రపురం, మండపేట మునిసిపాలిటీలు, ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న సుమారు 730 మందికి పైగా అవుట్‌సోర్సింగ్ కార్మికులకు వేతనపెంపు ప్రయోజనం లభిస్తుందని యూనియన్ ప్రతినిధులు చెబుతున్నారు. సుదీర్ఘకాలంగా తాము కోరుతున్న వేతనాల పెంపును ప్రభుత్వం అంగీకరించడంతో ఆనందోత్సాలు వ్యక్తంచేస్తూ స్వీట్లు పంచుకున్నారు.



మండపేట పట్టణంలో మంగళవారం సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కార్మికులు

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

కూటమి ప్రభుత్వం తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెడతామని మునిసిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ పిఠాపురంలోని జిల్లా ప్రతినిధులు సీహెచ్ సురేష్‌కుమార్, చిన్నారి సురేష్ తదితరులు తెలిపారు. సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న తమ కష్టాన్ని కూటమి ప్రభుత్వం గుర్తించిందని చెప్పారు. ఇక రాజమహేంద్రవరం కార్పొరేషన్ ఇంజనీరింగ్ వర్కర్లు సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసును కలిసి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర అవుట్ సోర్సింగ్ మునిసిపల్ ఇంజనీరింగ్ వర్కర్ల యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమాదుల ఏసుబాబు, సహాయ కార్యదర్శి బుంగ యేసురాజు, జిల్లా అధ్యక్షుడు కొటాని ముకుందరాం, నగర అధ్యక్షుడు సిరిక ప్రసాద్, కార్యదర్శి బాలభవాని కుమార్, ఉపాధ్యక్షుడు బి సాయి.. సీఎం ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. గత వైసీపీలో ఎన్ని ఆందోళనలు చేసినా ఎవరు పట్టించుకోలేదని, కూటమి ప్రభుత్వం తమ డిమాండ్లను గౌరవించి వేతనాలు పెంచడం ఆనందంగా ఉందని చెప్పారు. రాష్ట్రంలో 13వేల మంది కార్మికులు ప్రయోజనం పొందారని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు చెప్పారు. కాగా మండపేటలోనూ సీఎంకు పాలాభిషేకం చేశారు.

20 ఏళ్ల కల తీరింది..



20 ఏళ్లుగా ఏ ప్రభుత్వం మమ్మల్ని పట్టించుకోలేదు. ఇంజనీరింగ్, నాన్ పీహెచ్ సిబ్బంది ప్రత్యేక జీవోగాని వేతనాలు పెంపుదల చేపట్టలేదు. తొలిసారి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీకి కట్టుబడి మునిసిపల్ ఇంజనీరింగ్ శాఖలో గత 20 ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికులకు ప్రత్యేక జీవో ద్వారా జీతాలు పెంచింది. అందుకు కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు. సంక్షేమ పథకాలు అమలుచేయాలి.

- పెదపాటి గురునాథ్, మునిసిపల్ ఇంజనీరింగ్ సంఘ రాష్ట్ర సలహాదారుడు, కొవ్వూరు



మార్కెట్‌లో దొరుకుతున్న ఒడిషా విలసలు

జాడలేని పులస!

- యానాం మినహా ఎక్కడా దొరకని వైనం
- బొబ్బర్లంకలో ఇక పులస ఊసే లేదు
- ఈసారి ఒడిశా విలసలకు పెరిగిన డిమాండు

ఆత్రేయపురం, జూలై 23(ఆంధ్రజ్యోతి): పుస్తెలు అమ్మినా పులస తినాలనేది మాంసాహార ప్రియుల నోటిలో నానుతుండే పదం. ప్రస్తుతం గోదావరి నదిలో పులస జాడ ఎక్కడ కనిపించడంలేదు. యానాంలో ఒకటీ అరా మినహా మిగతా గోదావరి పరీవాహక ప్రాంతంలో పులసల ఊసే లేదు. సముద్రంలో ఉండే విలస ఈదుకుంటూ గోదావరిలోకి రాగానే పులసగా మారుతుందని తెలిసిన విషయమే. అయితే అది ధవళేశ్వరం బ్యారేజీ వరకు ఎదురీదుకుంటూ వస్తుందని, ఆయా ప్రాంతాల్లో దొరికే పులసకు చాలా రుచి ఉంటుందని పేరుండేది. దాంతో బొబ్బర్లంక నుంచి నారాయణలంక వరకూ గోదావరిలో లభ్యమయ్యే పులసకు విపరీతమైన డిమాండ్ ఉంది. గత ఏడాది నుంచి ఇప్పటివరకూ బొబ్బర్లంక గోదావరిలో ఒక్క పులస కూడా మత్స్యకారుల వలకు చిక్కిన దాఖలాలు లేవు. యానాంలో అడపదడపా దొరికే పులసలకు విపరీతమైన డిమాండ్ ఉంటోంది. సామాన్యులకు పులస తినాలంటే భారంగానే మారింది. ఈ నేపథ్యంలో ఒడిషా నుంచి వచ్చే విలసలను కొనుగోలు చేసుకుని మాంసంప్రియులు సరిపెట్టుకుంటున్నారు. ప్రస్తుతం ఈ చేపలకు డిమాండ్ నెలకొంది. గతంలో రూ.500 నుంచి వెయ్యి ఉండే ఒడిషా కిలో విలస ప్రస్తుతం రూ.1800 నుంచి రూ.2వేల ధర పలుకుతోంది. దీంతో మాంసాహార ప్రియులు ఒడిషా విలసలను కొనుగోలు చేసుకుని తృప్తిపడుతున్నామని పలువురు చెబుతున్నారు.


గోదావరిలో ఇసుక తిన్నెలూ కారణమే..

అలమూరు/మండపేట, జూలై 23(ఆంధ్రజ్యోతి): గోదావరిలో ఎర్రనీరు చేరిందంటే పులసలు రావడం సహజం. సముద్రంలో ఉండే విలసలు ఈ ఎర్రనీటిలో ఎదురీదుతూ అమోఘమైన రుచిని సొంతం చేసుకుంటాయి. అయితే ఆ విలసలు ఎదురీదడానికి అవసరమైన ఎర్రనీరు ప్రస్తుతం గోదావరిలో తేదనే చెప్పాలి. జూలై మూడో వారం గడిసిపోతున్నా ఇంకా గోదావరి నది మధ్యలో ఇసుక తిన్నెలు కనిపిస్తున్నాయి. ఈనెలలో ఓ నాలుగురోజులపాటు ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయిలో నీరు ప్రవహించింది. దీంతో గోదావరి పూటెక్కింది. ఆ తరువాత వరదనీరు అంతంతమాత్రమే. ఎగువ రాష్ట్రాల్లో వర్షాలు తగినంత కురవకపోవడం వల్ల ఇక్కడ ఈ పరిస్థితి నెలకొంది. దీంతో పులసలు ఎక్కడా కానరాడం లేదు. యానం వద్ద ఒకటి రెండు పడినా అవి పూర్తిస్థాయి పులసలుగా కొందరు పరిగణించరు. ఎందుకంటే సముద్రం నుంచి గోదావరిలో ఎంత దూరం ఎదురీదితే అంత రుచి ఈ పులసలకు వస్తాయి. యానాం అంటే దాదాపు ఉప్పునీరుతోనే ఉంటుంది. అక్కడ విలసలు గోదావరిలోకి చొరబడే సమయంలోనే జాలర్లకు చిక్కడం వాటిని వేలం వేయడం జరుగుతుందని చెబుతారు. ఈ నేపథ్యంలో అసలుసిసలు పులసలు దొరకడం ఇక గగనమనే చెప్పాలి. ధవళేశ్వరం, ఆత్రేయపురం, బొబ్బర్లంక, కోటిపల్లి, కపిలేశ్వరపురం, పొట్టిలంక తదితర ప్రాంతాల్లో దొరికే పులసలు కనుమరుగైనట్టేనని మత్స్యకారులూ చెబుతున్నారు. ఇప్పుడు ఈ ప్రాంతాల్లో ఒడిశా విలసల విక్రయాలే జరుగుతున్నాయి. గోదావరి పులసలుగా కొందరు మోసగించి విక్రయిస్తుంటే, కొందరు ఒడిశా విలసలుగానే చెబుతూ విక్రయాలు సాగిస్తుండడం గమనార్హం.

వైసీపీ పేటీఎం బ్యాచ్ ఆరోపణలు విడ్డూరం

చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే ఉపేక్షించం : మంత్రి సుభాష్

అమరావతి, జూలై23(ఆంధ్రజ్యోతి): అమలాపురంలో ఇద్దరు వ్యక్తులు ఉద్యోగాలిప్పిస్తామని డబ్బులు తీసుకోవడం, బాధితులు వారిని కొట్టడం, వైసీపీ పేటీఎం బ్యాచ్ జోక్యం చేసుకుని తన అనుచరులు కొట్టించారని వైసీపీ నేతలు తప్పుడు ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందని మంత్రి వాసంశెట్టి సుభాష్ మండిపడ్డారు. బుధవారం అమరావతి సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ చట్టాన్ని చేతిలోకి తీసుకుని, కొట్టడం తప్పేనని, అందువల్ల కొట్టిన వారిని చట్టపరంగా శిక్షించాలని తాను చెప్పినట్టు స్పష్టంచేశారు. తన గ్రామానికి చెందిన వ్యక్తి అయినంత మాత్రాన వారందరూ తన అనుచరులనడం సరికాదన్నారు. సంబంధం లేని వారిని ఇందులోకి తెచ్చి వివాదం చేస్తున్నారని మండిపడ్డారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్న వారిని ఉపేక్షించమన్నారు. వైసీపీ పేటీఎం బ్యాచ్.. కూటమి పాలనలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమంతోపాటు రాష్ట్రానికి పెట్టుబడులు రావడాన్ని చూడలేకపోతున్నారని, రప్పారప్పా నరికేస్తాం, చీకట్లో నరికేయమంటూ రకరకాల విన్యాసాలు చేస్తున్నారని విమర్శించారు. గత ఐదేళ్లలో జగన్ అమ్మించిన నాసిరకం మద్యం సేవించి, ఆ మత్తు దిగక.. మాట్లాడుతున్నారేమోనని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వంలో ఏ పథకానికైనా జగన్ బటన్ నొక్కడం తప్ప.. అర్హులందరికీ సొమ్ము పడలేదని, అలాంటి వాటిని అధిగమించి, తల్లికి వందనం పథకంలో ఎంతమంది పిల్లలుంటే అందరికీ లబ్ధి ఇస్తున్నామని చెప్పారు. ఎక్కడైనా అర్హులకు పడకపోతే.. మళ్లీ మళ్లీ గ్రీవెన్స్ పెట్టి అర్హులకు నగదు జమ చేస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వంలో అర్హులు ఆర్తనాదాలు చేసినా డబ్బులు పడిన పరిస్థితి లేదన్నారు. యువతకు వేలాది ఉద్యోగాలు వస్తున్నాయని చెప్పారు.





దుర్గాడలో శాకంబరేశ్వరుడిగా రామలింగేశ్వరస్వామి

గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో కొలువైన ఉన్న పంచాతయతన సమేత ఉమారామలింగేశ్వరస్వామిని శాకంబరేశ్వరుడిగా అలంకరించారు. ఆషాఢ మాసం, మాసశివరాత్రి, ఆరుద్ర నక్షత్రం సందర్భంగా సప్తహారతులు సమర్పించారు. మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తులు పూజాది కార్యక్రమాలు నిర్వహించగా, సేవా సమితి సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. - ఆంధ్రజ్యోతి/గొల్లప్రోలు రూరల్



పిఠాపురంలో శాకంబరిదేవి అలంకారంలో మహాలక్ష్మి అమ్మవారు

మహాలక్ష్మి అమ్మవారికి శాకంబరి అలంకారం

పిఠాపురం : శృంగేరి శంకరమఠం నిర్వహణలో పిఠాపురం పట్టణంలోని పెద్దబజారులో కొలువై ఉన్న మహాలక్ష్మి అమ్మవారికి శాకంబరీదేవి అలంకారం చేశారు. బుధవారం అమ్మవారిని పలు రకాల కాయగూరలు, పండ్లతో అలంకరించారు. ఆలయ నిర్వాకుడు ఇంద్రగంటి వెంకట గోపాలకృష్ణ ఆధ్వర్యంలో అర్చకులు పూజాదికాలు నిర్వహించారు.





శాకంబరిగా దర్శనమిస్తున్న మాణిక్యాంబ అమ్మవారు.. సారె సమర్పించిన మహిళలు

శాకంబరిగా హసన్‌బాద మాణిక్యాంబ అమ్మవారు

సారె సమర్పించిన గ్రామస్తులు

ద్రాక్షారామ, జూలై23(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం హసన్‌బాద గ్రామంలో ఉన్న భీమేశ్వరస్వామి సమేత మాణిక్యాంబ అమ్మవారి ఆలయంలో బుధవారం మాణిక్యాంబ అమ్మవారు శాకంబరిగా దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు ఉండి వీరభద్రశర్మ అమ్మవారికి శాకంబరిగా అలంకరించారు. అనంతరం గ్రామస్తులు పసుపు, కుంకుమ, పుష్పాలు, స్వీట్లు, పండ్లతో కూడిన సారెతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని అమ్మవారికి సారె సమర్పించారు. కార్యక్రమంలో చింతపల్లి సతీష్ దంపతులు, సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు దంపతులు, చెక్కాతాతాజీ దంపతులు, జెడ్పీమాజీ వైస్ చైర్మన్ చింతపల్లి వీరభద్రరావు, చెక్కా చినసోమరాజు దంపతులు, చోడిశెట్టి వీరభద్రరావు పాల్గొన్నారు.



శాకంబరీ అమ్మవారిగా బాలాత్రిపుర సుందరి

బాలాత్రిపురసుందరికి చీర, సారె

ఘనంగా లక్ష పసుపు కొమ్ముల పూజ... శాకంబరీ అలంకరణతో అమ్మవారి దర్శనం

సామర్లకోట, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాస పర్వదినాలను పురస్కరించుకుని సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయంలో బాలాత్రిపురసుందరి అమ్మవారికి శాకంబరీ అలంకారంలో పూజలు నిర్వహించారు. దీనిలో భాగంగా సామర్లకోట గ్రామ దేవత నూకాంబికా అమ్మవారి ఆలయం నుంచి ముత్తైదువలు, దాతలు సమకూర్చిన చీర, సారె పిండివంటలు, పండ్లను మహిళలు ప్రదర్శనగా బాలాత్రిపురసుందరి అమ్మవారికి సమర్పించేందుకు బుధవారం తరలివచ్చారు. ఈ ప్రదర్శన అగ్రభాగాన పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తన శిరస్సున అమ్మవారికి చీర,సారె, పసుపుకొమ్ములతో కూడిన పళ్లెంతో ప్రదర్శనలో పాల్గొన్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, రాజగోపాలశర్మ, అంజిబాబు, వెంకన్న, వినయ్ తదితరుల వేదమంత్రోచ్ఛరణల మధ్య భీమేశ్వరాలయంలో మహిళల నుంచి చీర, సారెలతో కూడిన పిండి వంటకాలను, పసుపుకొమ్ములను స్వీకరించారు. మొట్టమొదటిసారిగా ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో భక్తులు, దాతలు అందించిన సుమారు రెండు టన్నుల పరిమాణం గల పసుపుకొమ్ములతో లక్ష పసుపు కొమ్ముల పూజ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ పూజలో ఆలయ ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ కంటే జగదీష్‌మోహన్(బాబు) దంపతులు ఆశీనులయ్యారు. పూజ అనంతరం పసుపుకొమ్ములను మహిళా భక్తులకు అందజేశారు.

శాకంబరీగా అమ్మవారు..

ఆషాఢమాసం పురస్కరించుకుని సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయంలో బాలాత్రిపుర సుందరి అమ్మవారిని శాకంబరీ అమ్మవారిగా సర్వాంగసుందరంగా అలంకరించి భక్తులకు దర్శనాల నిమిత్తం అనుమతించారు. సుమారు 108 రకాల పిండివంటలు, పండ్లు, కూరగాయలు, ఆకుకూరలతో శాకంబరిగా అలంకరించారు. ఆలయ ఆవరణలో సుమారు నాలుగు టన్నుల పరిమాణం గల కూరగాయలు, ఆకుకూరలతో ఆలయంలోని అన్ని ఉపాలయాలను, దేవతా మూర్తులను కూరగాయల మాలలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. నంది మండపం వద్ద శివలింగాకృతిలో కూరగాయలతో, ఆకుకూరలతో అలంకరించారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు అడబాల కుమారస్వామి, బదుగు శ్రీకాంత్, బలుసు శ్రీనివాసు, జయలక్ష్మి, అందుగుల జార్జి చక్రవర్తి, ఆర్వీ. సుబ్బరాజు, కర్రి ఆదినారాయణ, కంచర్ల సుష్మామోహిని, కటకం షైమావతి, రత్నకుమారి, కాపుగంటి పైడిరత్నం, సత్తి అరుణ, మద్దాల గీత పాల్గొన్నారు.





చీర, సారెలతో ప్రదర్శనగా తరలివెళుతున్న ఎమ్మెల్యే చినరాజప్ప, మహిళలు

ప్రతి అన్నదాతకు వ్యవసాయ కనెక్షన్

» పుష్కరాలకు ఇప్పటి నుంచే సిద్ధం

» మంత్రి గొట్టిపాటి రవికుమార్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

రాజమహేంద్రవరం, జూలై23(ఆంధ్రజ్యోతి): దరఖాస్తు చేసుకున్న ప్రతి అన్నదాతకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు. బుధవారం ఆయన విద్యుత్‌శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అధికారులకు పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్, ఆర్డీఎస్ఎస్ పనుల పురోగతిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రానున్న గోదావరి పుష్కరాలకు ఇప్పటి నుంచే విద్యుత్‌శాఖ సిద్ధం కావాలన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, లోఓల్టేజీ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. అవసరమైన ప్రాంతాల్లో కొత్త సబ్‌స్టేషన్లను నిర్మిస్తున్నామని చెప్పారు. వైసీపీ హయాంలో విద్యుత్ శాఖ నిర్వీర్యమైందన్నారు. శాఖపై కొందరు వదంతులు సృష్టించి గందరగోళానికి గురి చేస్తున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 75వేల వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లు ఇచ్చామని, రైతులపై కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి ఇదే నిదర్శనమని తెలిపారు. విద్యుత్ ఇబ్బందులు లేకుండా చేయడానికి అవసరమైతే అదనపు సిబ్బందిని నియమిస్తామన్నారు. పారిశ్రామిక, వ్యాపార ప్రాంతాల్లో వచ్చే ఫిర్యాదులు, సమస్యలపై వెంటనే స్పందించే విధంగా చర్యలు చేపట్టామన్నారు. శాఖాపరంగా, నిర్వహణలో ఏదైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి ప్రయత్నిస్తానని అధికారులతో చెప్పారు. ఈ కార్యక్రమంలో తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ ప్రశాంతి, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బత్తుల బలరామకృష్ణ, ఎస్ఈ తిలక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ తీర ప్రాంత రక్షణకు కేంద్రం తక్షణ చర్యలు తీసుకోవాలి

» లోక్‌సభలో ప్రస్తావించిన కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్

కలెక్టరేట్(కాకినాడ),జూలై23(ఆంధ్రజ్యోతి): సముద్ర అలల కారణంగా కోతకు గురవుతున్న కాకినాడ తీర ప్రాంతాన్ని రక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణం చర్యలు తీసుకోవాలని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ కోరారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో భాగంగా బుధవారం ఆయన లోక్‌సభలో రూల్ 377 కింద ఈ అంశాన్ని లేవనెత్తారు. జాతీయ తీర పరిశోధనా కేంద్రం నివేదిక ప్రకారం కాకినాడ తీర ప్రాంతంలో 52.8శాతం భూభాగం కోతకు గురవుతోందన్నారు. ఇది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే అత్యధికమన్నారు. దీనివల్ల తీరప్రాంత గ్రామాలైన ఉప్పాడ, నేమాం, కొమరగిరి, అమీనాబాద్, సుబ్బంపేట గ్రామాల్లో ఇప్పటివరకు 650 ఎకరాల భూమి, వెయ్యికిపైగా ఇళ్లు సముద్రంలో కలిసినట్లు నివేదికలు చెప్తున్నాయని వివరించారు. మత్స్యకారులు, రైతులతోపాటు జాతీయ ఖ్యాతి గాంచిన ఉప్పాడ జంధానీ చీరలు తయారు చేసే చేనేత కార్మికుల జీవనోపాధిపై కూడా ఈ సమస్య తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. కోత రక్షణకు ఇప్పటివరకు ఉపయోగించిన సీవాల్స్ జియోట్యూబ్ సత్ఫలితాలు ఇవ్వలేదన్నారు. శాశ్వత పరిష్కారం కోసం కాకినాడ కోస్టల్ ఎరోషన్ మిటిగేషన్ ప్రాజెక్టును జాతీయ తీర పరిశోధనా కేంద్రం సహకారంతో ఏపీ రాష్ట్ర విపత్తు నిర్వహణశాఖ రూపొందించిందన్నారు. రూ.323కోట్ల వ్యయంతో తయారైన ఈ ప్రాజెక్టులో టెట్రాపాడ్, సీవాల్స్, గ్రోయిన్స్, బీచ్ నరిష్మెంట్‌తో కోతకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. హోంమంత్రిత్వ శాఖ త్వరితగతిన ఆమోదించాలని కోరారు.

పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక



కాకినాడ జిల్లా క్రీడామైదానంలో పారాస్పోర్ట్స్ ఎంపికలో పాల్గొన్న క్రీడాకారులు

కార్పొరేషన్(కాకినాడ),జూలై 23(ఆంధ్రజ్యోతి): పారా 6వ రాష్ట్రస్థాయి జూనియర్, సబ్ జూనియర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్-2025 ఎంపిక కోసం కాకినాడ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ క్రీడామైదానంలో పారాస్పోర్ట్స్ అసోసియేషన్‌ఆధ్వర్యంలో జిల్లాస్థాయి పోటీలు బుధవారం నిర్వహించారు. కాకినాడజిల్లా స్విమ్మింగ్ కోచ్ పైల అప్పలనాయుడు, సీఎస్‌బీ బ్యాంక్ వైస్ ప్రెసిడెంట్ వి.సతీష్‌కుమార్, పారాస్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.రామస్వామి జెండా ఊపి పోటీలను ప్రారంభించారు. జిల్లా నలుమూలలనుంచి 50మంది క్రీడాకారులు పాల్గొన్నారు. పాతవారితోపాటు మొదటిసారి పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. పారా క్రీడల ద్వారా తమ పిల్లలకు భవిష్యత్తు ఉంటుందని తల్లిదండ్రులు ఆశాభావం వ్యక్తం చేశారు. కాకినాడ జిల్లా ఇన్చార్జి, ఇంటర్నేషనల్ మెడలిస్ట్ జి.శివగంగా దుర్గ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు టి.రాము, నేషనల్ స్విమ్మర్ నూకరాజు, దివ్యాంగ సంస్థల ప్రతినిధులు, కోచ్‌లు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా రిపేర్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు



అధ్యక్షుడిగా ఎన్నికైన నరసింహారావును సత్కరిస్తున్న తూనికలు, కొలతల శాఖ అధికారులు

కార్పొరేషన్(కాకినాడ), జూలై 23(ఆంధ్రజ్యోతి): తూనికలు, కొలతల శాఖ ఆధ్వర్యంలో చేపట్టే కాటా, వేబ్రిడ్జి, చిన్న కాటా రిపేర్ వర్కర్స్ నూతనంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రిపేర్స్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా లంకలపల్లి నరసింహారావు, ఉపాధ్యక్షుడిగా టేకుమూడి శ్రీనివాసరావు, కార్యదర్శిగా కొప్పిశెట్టి శ్రీనుబాబు, సంయుక్త కార్యదర్శిగా పిడపర్తి రమేష్, కోశాధికారిగా కనితి బ్రహ్మానందంచారి, సభ్యులుగా యాళ్ల రాజీవ్‌రావు, మహేశ్వరరావు, దిగుమర్తి వెంకట్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.తూనికలు, కొలతలశాఖ డిప్యూటీ కంట్రోలర్ జనార్దన్, అసిస్టెంట్ కంట్రోలర్ సలీంలను కార్యవర్గం బుధవారం మర్యాదపూర్వకంగా కలిసింది.

హోరాహోరీగా తలపడిన మెడికోలు

» రాజానగరం జీఎస్ఎల్ కళాశాలలో ఉత్సాహంగా క్రీడా పోటీలు

» సత్తా చాటిన మహిళా మెడికోలు

» సెమీ ఫైనల్స్‌కు ఏడు జట్లు



జీఎస్ఎల్ కళాశాల క్రీడా ప్రాంగణంలో త్రోబాల్ పోటీల్లో తలపడుతున్న మహిళా మెడికోలు

రాజానగరం, జూలై 23(ఆంధ్రజ్యోతి): డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ పరిధిలోని మెడికల్, డెంటల్ కళాశాలల 25వ మహిళా గేమ్స్ మీట్ రాజానగరం సమీపంలోని జీఎస్ఎల్ మెడికల్ కళాశాల క్రీడాప్రాంగణంలో రెండో రోజైన బుధవారం హోరాహోరీగా సాగాయి. వైద్య విద్యార్థినులు వర్షాన్ని సైతం లెక్క చేయకుండా క్రీడాస్ఫూర్తితో సత్తా చాటుకునేందుకు పోటీపడు తున్నారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ స్పోర్ట్స్ క్లబ్ సెక్రటరీ ఇత్రిమూర్తి రెండోరోజు క్రీడా పోటీల ఫలితాలను వెల్లడించారు. వివిధ క్రీడల్లో 10 జట్లు క్వార్టర్ ఫైనల్స్‌కి, మరో 7జట్లు సెమీ ఫైనల్స్‌కు చేరాయన్నారు.

త్రోబాల్ పోటీల్లో విజేతలు

త్రోబాల్ క్రీడా పోటీల్లో ఎస్వీ మెడికల్ కళాశాల(తిరుపతి) జట్టుపై జీఎస్ఎల్ మెడికల్ కళాశాల(రాజమహేంద్రవరం) జట్టు, గాయత్రి మెడికల్ కాలేజీ(విశాఖపట్నం)జట్టుపై కిమ్స్ డెంటల్ కళాశాల(అమలాపురం)జట్టు విజయం సాధించి క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాయి.

బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతలు

బ్యాడ్మింటన్‌లో ఏసీఎస్ఆర్ మెడికల్ కళాశాల(నెల్లూరు) జట్టుపై జీఎస్ఎల్ మెడికల్ కళాశాల జట్టు, అపోలో మెడికల్ కళాశాల జట్టుపై జీఎస్ఎల్ డెంటల్ కళాశాల జట్టు గెలిచి క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నారు.

వాలీబాల్ పోటీల్లో విజేతలు

వాలీబాల్ పోటీల్లో ఎస్వీ మెడికల్ కళాశాల(తిరుపతి)జట్టుపై గుంటూరు మెడికల్ కళాశాల జట్టు, జీఎంసీ మెడికల్ కళాశాల జట్టు (కడప)పై ఎస్ఆర్ఐ మెడికల్ కళాశాల (విశాఖపట్నం) జట్టు, ఎన్ఆర్ఐ మెడికల్ కళాశాల(గుంటూరు)పై పిన్నమనేని సిద్దార్థ మెడికల్ కళాశాల(గన్నవరం) జట్టు, కిమ్స్(అమలాపురం)జట్టుపై జీఎస్ఎల్ మెడికల్ కళాశాల జట్టు, ఏసీఎస్ఆర్(నెల్లూరు) జట్టుపై ఆర్ఎంసీ(కాకినాడ) జట్టు, సెయింట్ జోసెఫ్ డెంటల్ (ఏలూరు)జట్టుపై ఆశ్రమ్(ఏలూరు) జట్టు విజయం సాధించి క్వార్టర్ ఫైనల్స్ చేరుకున్నాయి.

బాస్కెట్‌బాల్ పోటీల్లో..

బాస్కెట్‌బాల్ ఆర్ఎంసీ(కాకినాడ)జట్టుపై ఎన్ఆర్ఐ(గుంటూరు) జట్టు, జీఎస్ఎల్ డెంటల్ కళాశాల జట్టుపై మిమ్స్(విజయనగరం) జట్టు, సెయింట్ జోసెఫ్ డెంటల్ కళాశాల(ఏలూరు) జట్టుపై పిన్నమనేని సిద్దార్థ మెడికల్ కళాశాల జట్టు గెలిచి సెమీఫైనల్స్‌కు చేరుకున్నాయి.

బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో..

బాల్ బ్యాడ్మింటన్‌లో పిన్నమనేని సిద్దార్థ మెడికల్ కళాశాల జట్టుపై సిద్దార్థ మెడికల్ కళాశాల(విజయవాడ)జట్టు సెమీఫైనల్‌కు చేరాయి.

టేబుల్ టెన్నిస్‌లో పోటీల్లో..

టేబుల్ టెన్నిస్‌లో ఎన్ఆర్ఐ మెడికల్‌కళాశాల(విశాఖపట్నం) జట్టుపై జీఎస్ఎల్ మెడిక ల్ కళాశాల జట్టు, ఎస్వీ మెడికల్ కళాశాల (తిరుపతి)జట్టుపై జీఎస్ఎల్ మెడికల్ కళాశాల జట్టు గెలిచి సెమీఫైనల్స్‌కు చేరుకున్నట్లు జీఎస్ఎల్ మెడికల్ కళాశాల పీడీ శ్రీనివాసరావు తెలిపారు.

నన్నయ వీసీకి సుబ్బుకృష్ణ అవార్డు



సుబ్బుకృష్ణ స్మారక ఉత్తమ కమ్యూనిటీ భాషా శాస్త్రవేత్త అవార్డుతో నన్నయ వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, జూలై23(ఆంధ్రజ్యోతి): ప్రతిష్టాత్మకమైన ప్రొఫెసర్ ఆర్.సుబ్బుకృష్ణ స్మారక ఉత్తమ కమ్యూనిటీ భాషా శాస్త్రవేత్త అవార్డు 2025ను ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ప్రసన్నశ్రీకి ప్రదానం చేశారు. బుధవారం విశ్వవిద్యాలయం కాన్ఫరెన్స్‌హాల్‌లో వర్చువల్‌గా జరిగన కార్యక్రమంలో ఈ అవార్డు ప్రదానం జరిగింది. మన దేశంలో గిరిజన భాషలు, లిపి అభివృద్ధికి ఆమె చేసిన అసాధారణ కృషికిగాను వీసీ ప్రసన్నశ్రీకి ఈ పురస్కారం లభించింది. దీన్ని డైరెక్టరేట్ ఆఫ్ రీజినల్ ఇండియన్ లాంగ్వేజస్ అండ్ రీసెర్చ్, మణిపూర్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ, అపుంబా ఇరెయిపక్కి మహేయిరోయ్‌సి సిన్‌పాంగ్‌లుప్ కలిపి బుధవారం మణిపూర్‌లో నిర్వహించాయి. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ అధికారులు, సిబ్బంది ఆమెకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, అధ్యాపకులు ఆచార్య బి.జగన్మోహనరెడ్డి, కె.రమణేశ్వరి పాల్గొన్నారు.

ధవళేశ్వరం వద్ద పెరుగుతున్న గోదావరి ఉధృతి



» 2.38
లక్షలు
క్యూసె
క్కుల
నీరు
సము
ద్రంలోకి
విడుదల

కాటన్ బ్యారేజ్ నుంచి దిగువకు ప్రవహిస్తున్న వరద నీరు

ధవళేశ్వరం, జూలై 23(ఆంధ్రజ్యోతి): కొద్ది రోజులుగా ప్రశాంతంగా ప్రవహిస్తున్న గోదావరి ఎగువ ప్రాంతాల్లో విస్తారమైన వర్షాల కారణంగా వాగులు, వంకలు పొంగి కలుస్తూ ఉండడంతో ఉధృతంగా ప్రవహిస్తోంది. తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరంవద్ద నీటిమట్టం పెరుగుతూ ఉండడంతో కాటన్ బ్యారేజ్ మొత్తం 175 గేట్లను అరమీటరు మేర పైకి ఎత్తి 2,38,886 క్యూసెక్కులను సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. దీంతో బుధవారం సాయంత్రానికి ధవళేశ్వరంవద్ద నీటిమట్టం 10.90 అడుగులుగా నమోదైంది. డెల్టా పరిధిలో కురుస్తున్న వర్షాల కారణంగా డెల్టా కాలువలకు సాగునీటి విడుదలను తగ్గించారు. తూర్పుడెల్టాకు 3,800 క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 2,100 క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 4,700 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఎగువున భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం పెరుగుతూ బుధవారం సాయంత్రానికి 20 అడుగులకు చేరుకుంది.

కారం తమ్మన్న దొర వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలి: ఆదివాసీ జేఏసీ

దేవీపట్నం, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఈనెల 25న తొలి మన్యం వీరుడు, స్వాతంత్ర్య సమర యోధుడు కారం తమ్మన్నదొర 145వ వర్ధంతి సందర్భంగా ఏపీ రాష్ట్ర ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్‌చైర్మన్ తెల్లం శేఖర్ కోరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మనదేశంలో 1857 తిరుగుబాటుకు ముందే కారం తమ్మన్నదొర బ్రిటిష్ వారిపై రంపచోడవరం కేంద్రంగా 1839 నుంచి 1847 వరకు రంప తిరుగుబాటు చేశారన్నారు. బ్రిటిష్‌వారిపై జరిపిన పోరాటంలో 1880,జూలై 25న వీరమరణం పొందారని, ఇంతటి చరిత్ర కలిగిన తమ్మన్నదొర వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.



శిక్షణ సామాగ్రి అందజేస్తున్న విజయకుమార్

వినూత్న సాంకేతికతతో శిక్షణ ఎంతో అవసరం

» రాష్ట్ర అటవీ అకాడమీ డైరెక్టర్

దివాన్‌చెరువు,జూలై 23(ఆంధ్రజ్యోతి): అడవుల నిర్వహణ, వన్యప్రాణుల సంరక్షణలో తాజా వినూత్న సాంకేతికతలతో శిక్షణ ఎంతో అవసరమని రాష్ట్ర అటవీ అకాడమీ డైరెక్టర్ బి.విజయకుమార్ అన్నారు. దివాన్‌చెరువు సమీపంలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అటవీ అకాడమీలో 13వబ్యాచ్ అటవీ బీట్ అధికార్ల శిక్షణ ప్రారంభోత్సవ కార్యక్రమం బుధవారం అకాడమీలో జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన డైరెక్టర్ విజయకుమార్ మాట్లాడుతూ అటవీ, వన్యప్రాణుల నిర్వహణలో సమకాలీన సమస్యలు, వినూత్న సాంకేతికతలపై దృష్టిసారించేందుకు శిక్షణ దోహదపడుతుందన్నారు. కోర్సు డైరెక్టర్ ఆర్.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని 22అటవీ విభాగాలనుంచి 38మంది ఎఫ్‌బీవోలు శిక్షణకు హాజరయ్యారన్నారు.ఆరునెలలపాటు ఈశిక్షణ జరుగుతుందన్నారు.ఫ్యాకల్టీసభ్యులుశ్రీనివాసరావు, శ్రీహరిగోపాల్, శ్రీరామారావు పాల్గొన్నారు.

వైసీపీ నాయకులే టార్గెట్

» పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి » సెంట్రల్ జైలులో ఎంపీ మిథున్‌తో ములాఖత్



జైలులో మిథున్‌రెడ్డిని కలిసి బయటకువస్తున్న పెద్దిరెడ్డి, వనిత, భరత్ రామ్

రాజమహేంద్రవరం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి వైసీపీ శ్రేణులను ముఖ్యంగా ప్రధాన భూమిక పోషించే నాయకులను టార్గెట్ చేసి అనేక రకాలుగా ఇబ్బందులు పెడుతున్నారని వైసీపీ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. తూర్పు గోదావరి జిల్లా సెంట్రల్ జైలులో రిమాండు ఖైదీగా ఉన్న ఆయన కుమారుడు, వైసీపీ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని ములాఖత్ ద్వారా బుధవారం కలిశారు. ఆయన వెంట మాజీ హోం మంత్రి తానేటి వనిత, మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ ఉన్నారు. అనంతరం జైలు బయట మీడియాతో రామచంద్రారెడ్డి మాట్లాడుతూ వైసీపీ నాయకులపై అనేక రకాల కేసులు పెడుతున్నారన్నారు. ఒక ప్రజాప్రతినిధికి ఇవ్వాల్సిన గౌరవాన్ని ప్రజాప్రతినిధులుగా ఉన్న చంద్రబాబుగానీ వారి మంత్రివర్గ సభ్యులు ఎందుకు విస్మరిస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. వైసీపీ శ్రేణులు తప్పకుండా ఈ పరి స్థితిని అధిగమించి ఈ ప్రభుత్వానికి బుద్ధి చెప్పే రోజులు దగ్గరలో ఉన్నాయన్నారు. ప్రభుత్వం తీసుకొనే చర్యలను ఖండిస్తున్నామన్నారు. మిథున్ రెడ్డి ఎలాంటి ఇబ్బంది అయినా ఎదుర్కొంటారని, సౌకర్యాలను కోరుకునే వ్యక్తి కాదన్నారు. న్యాయపరంగా కల్పించిన సదుపాయాలను కల్పించడం లేదని, కక్షపూరితంగా వ్యవహరిస్తున్నా రని ఆరోపించారు. మిథున్ బాగున్నారని, సంతోషంగా ఉన్నారని చెప్పారు. నిబంధనల ప్రకారం నడుచుకోకపోతే న్యాయ స్థానాలనే ఆశ్రయిస్తామన్నారు. జగన్ ప్రభుత్వ హయాంలో ధరలు పెంచడం ద్వారా మద్యాన్ని నియంత్రించామని తానే టి వనిత అన్నారు. మా ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు స్కాం జరిగిందని లేనిపోని నిందలు మోపుతున్నారన్నారు. భరత్‌రామ్ మాట్లాడుతూ మిథున్ రెడ్డిని అరెస్టు చేసి ప్రతిపక్షాల నోరు నొక్కుతున్నారన్నారు.

వైసీపీ శ్రేణుల హల్‌చల్

రామచంద్రారెడ్డి కారుకు ముందు ఉన్న కార్ల బయట నుంచొని వైసీపీ యువకులు హల్‌చల్ చేశారు. జైలు వద్ద ఒక అడిషనల్ ఎస్పీ, ఇద్దరు డీఎస్పీలతో సహా సుమారు 100 మందితో బందో బస్తు ఏర్పాటు చేశారు. అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) ఎన్‌బీఎం మురళీకృష్ణ పర్యవేక్షించారు. రామచంద్రారెడ్డి వస్తున్న సమయంలో వైసీపీ యువకులు డివైడ్ దాటి జైలు వైపునకు దూసుకురావడం గమనించిన మురళీకృష్ణ ఒక్క ఉదుటున వెళ్లి వెనక్కి పంపేశారు. రామచంద్రారెడ్డి వెంట కారు మూరి నాగేశ్వరరావు, జక్కంపూడి రాజా, తోట త్రిమూర్తులు తదితర వైసీపీ నాయకులు రాగా.. నిబంధనల ప్రకారం జైలు బయటే పోలీసుల ఆపేశారు. దీంతో పోలీసులతో వాళ్ల వాగ్వాదానికి దిగారు. పోలీసులు అతికష్టంపై వాళ్లను రోడ్డు అవతలకు పంపేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ప్రిజన్ కేఫ్‌ని మూయించారు.


సెంట్రల్ జైలు బయట వైసీపీ శ్రేణులు

వీధి సుబ్రహ్మణ్యం హత్య వెనుక వైసీపీ పెద్దల హస్తం

త్వరలోనే అసలు విషయాలు బయటకు : టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సరిపల్లి రాజేష్


కాకినాడలో మాట్లాడుతున్న రాజేష్

కాకినాడ సిటీ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ అనంతబాబు కారు డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యంను హత్య చేసి డోర్ డెలివరీ చేసిన ఘటన వెనుక వైసీపీ పెద్దల హస్తం ఉందని, సిట్ విచారణలో త్వరలోనే అసలు విషయాలు బయటపడతాయని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సరిపల్లి (మహాసేన) రాజేష్ పేర్కొన్నారు. కాకినాడలో టీడీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుబ్రహ్మణ్యం హత్యకు సంబంధించి గత వైసీపీ ప్రభుత్వం వాస్తవాలను దాచిపెట్టిందన్నారు. ఈ విషయాన్ని రాజమండ్రిలో జరిగిన మహానాడు సభలో చంద్రబాబునాయుడు దృష్టికి దళిత నాయకులతో కలిసి తీసుకెళ్లామని, అధికారంలోకి రాగానే ఈ హత్యపై సమగ్ర విచారణ జరిపించాలని కోరామన్నారు. దీంతో సుబ్రహ్మణ్యం హత్య కేసులో వాస్తవాలను వెలుగు తీసేందుకు కూటమి ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. ఈ హత్య జరిగినప్పుడు పోలీసులు సమగ్ర విచారణ చేపట్టలేదన్నారు. హత్య జరిగిన సమయంలో జరిగిన ఘటనలు సెల్‌ఫోన్ టవర్లు, సీసీ కెమెరాల ఫుటేజ్‌ల ద్వారా త్వరలోనే బయటకు వస్తాయన్నారు. ఈ హత్య ఎమ్మెల్సీ అనంతబాబు ఒక్కరి వల్ల జరిగింది కాదని, దీని వెనుక కాకినాడ, రాజానగరం వైసీపీ నాయకుల అండదండలు ఉన్నాయన్నారు. సుబ్రహ్మణ్యం దగ్గర వైసీపీ నాయకుల అక్రమాలకు సంబంధించి బలమైన సాక్ష్యాధారాలు ఉన్నాయని, అవన్నీ బయట పడతాయనే హత్య చేశారని ఆయన ఆరోపించారు. సమావేశంలో రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లాబత్తుల అప్పారావు, మాజీ కార్పొరేటర్ పలివెల రవి అనంతకుమార్, బంగారు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో ముగ్గురి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రఘువీర్

ద్రాక్షారామ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం నవరత్నాల గరువురోడ్డులో ఇంట్లో చోరీకి పాల్పడిన ముగ్గురిని ద్రాక్షారామ పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం రామచంద్రపురంలో విలేకర్ల సమావేశంలో ఈ వివరాలను డీఎస్పీ రఘువీర్ వివరాలు వెల్లడించారు. నవరత్నాల గరువు రోడ్డులో ఉన్న తాతపూడి గోవిందు ఇంటి తాళం బద్దలుకొట్టి దొంగలు లోపలికి ప్రవేశించి 2 జతల వెండి పట్టీలు, రూ.5వేల నగదు అపహరించుకుపోయారు. దీనిపై ఈనెల 22న ద్రాక్షారామ పోలీసులు కేసు నమోదు చేశారు. బుధవారం మధ్యాహ్నం తాళ్లపొలం రైల్వే ట్రాక్ వద్ద కాకినాడ జిల్లా పెద్దాపురానికి చెందిన సిమ్మా మణికంఠ, నల్గొండ జిల్లా లక్ష్మీపురం తండాకు చెందిన ఆమ్‌గోతు బాబు, పాతర్లగడ్డ తండాకు చెందిన రమావత్ కోటేష్‌ను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 20 తులాల వెండి పట్టీలు, రూ.5వేలు నగదు, పల్సర్ మోటారు సైకిల్ స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. కేసులో చురుకుగా వ్యవహరించిన హోంగార్డు వెంకటేష్‌ను సత్కరించారు. సీఐ వెంకటనారాయణ, ఎస్ఐ లక్ష్మణ్ పాల్గొన్నారు.

మోటారుసైకిళ్లు చోరీ

ఇద్దరికి రెండేళ్ల జైలు

కొవ్వూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు పట్టణంలో దొంగతనాలకు పాల్పడిన ఇద్దరు వ్యక్తులపై నేరం రుజువు కావడంతో 2 సంవత్సరాల జైలుశిక్ష విధించినట్లు కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. వివరాల ప్రకారం.. రాజమహేంద్రవరానికి చెందిన తెల్లంశెట్టి సాయిబార్గవ్, నేతల వివేక్ 2024లో కొవ్వూరులో 2 మోటారుసైకిళ్ల దొంగతనానికి పాల్పడ్డారు. దీనిపై అప్పటి ఎస్ఐ కె.జగన్మోహనరావు కేసు నమోదు చేసి ఇద్దరిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చారు. బుధవారం కొవ్వూరు రెండో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపర్చగా ఇద్దరికి రెండేళ్ల సాధారణ జైలుశిక్ష విధిస్తూ మెజిస్ట్రేట్ కె.నాగలక్ష్మి తీర్పు చెప్పారు.

సహస్ర ఘటాభిషేకం

తునిరూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రం లోవ దేవస్థానంలో ఆషాఢ మాసోత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారికి సహస్ర ఘటాభిషేకం, విశేష పూజాది కార్యక్రమాలు పండితులు నిర్వహించారు. విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, సర్వతోబాద్రమండల దేవతా కలములతో కలశాలు ఏర్పాటు చేసి సప్తనదీ జలాలు ఉంచి వరుణ పూజా కార్యక్రమాలు చేశారు. పెద్దఎత్తున భక్తులు పూజలు ఆచరించారు.


లోవలో సహస్ర ఘటాభిషేకం దృశ్యం

దళితుడిపై అమానుష దాడి కేసులో..

ముగ్గురి అరెస్ట్, పరారీలో మరో ముగ్గురు : అమలాపురం డీఎస్పీ

అమలాపురం టౌన్, జూలై 23(ఆంధ్రజ్యోతి): దళితుడిపై అమానుష దాడి కేసులో ముగ్గురిని అరెస్టు చేసినట్టు అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్కే. ప్రసాద్ తెలిపారు. ఈ వివరాలను బుధవారం అమలాపురం టౌన్ పోలీసుస్టేషన్‌లో డీఎస్పీ విలేకర్లకు వివరించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం వెలువలపల్లికి చెందిన దళితుడు దోనిపాటి మహేశ్వరరావు అలియాస్ మహేష్ అమలాపురం రాయల్ కళాశాలలో పని చేసే విజయ్‌కుమార్ ద్వారా తుని పురపాలక సంఘంలో బిల్ కలెక్టర్‌గా పనిచేసే ఉద్యోగి సిరసపల్లి ఉదయ్‌శంకర్ అమలాపురం, ముమ్మిడివరం నగర పంచాయతీలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలు ఇప్పిస్తున్నాడని తెలిసి తనకు తెలిసిన వ్యక్తి కోసం రూ.2లక్షలు సొమ్ములు చెల్లించి రెండేళ్ల క్రితం మోసపోయాడు. దాంతో మహేష్ ఉదయ్‌శంకర్‌కు ఫోన్ చేసి డబ్బులు అడగగా కొంతమందికి కాన్ఫరెన్సు కాల్ కలుపుతాను. మా పెద్ద సార్‌లా మాట్లాడి వారం రోజుల్లో మీకు ఆర్డరు కాపీలు వచ్చేస్తాయని చెబితే చాలు అని మహేష్‌ను నమ్మించాడు. తద్వారా మిగిలిన సొమ్ములు వచ్చిన తరువాత మహేష్‌కు ఇవ్వాల్సిన మొత్తం ఇస్తానని మరోసారి నమ్మబలికాడు. ఈ తరహాలో మహేష్ పలుసార్లు కాన్ఫరెన్సు కాల్స్‌లో యల్లమిల్లి విజయ్, యర్రా కృష్ణ తదితరులతో మాట్లాడాడు.

సొమ్ముల కోసం చిత్రహింసలు..

ఉదయ్‌శంకర్‌కు ఉద్యోగాలు నిమిత్తం యల్లమిల్లి విజయ్ ద్వారా ఏడుగురు బాధితులు రూ.6.75లక్షలు చెల్లించారు. ఉదయ్‌శంకర్ మోసం చేశాడని తెలిసి ఈనెల 19వ బాధితులు ఉదయ్‌శంకర్, మహేష్‌ను రమ్మని పిలిచారు. మహేష్ తను గతంలో పనిచేసిన రాయల్ కళాశాలలో పనిచేస్తున్న విజయ్‌కుమార్‌తో పాటు మరో ఇద్దరు అధ్యాపకులను తీసుకుని 2మోటారు సైకిళ్లపై పేరూరు సెంటర్‌కు చేరుకున్నారు. అక్కడ యల్లమిల్లి విజయ్, ఉరదల బాలరాజు, యర్రా కృష్ణ, మరికొందరు కలిసి యర్రా కృష్ణ పేరూరులో అద్దెకు ఉంటున్న రేకుల షెడ్డు వద్దకు తీసుకువెళ్లారు. ఉదయ్‌శంకర్, మహేష్‌పై దాడిచేశారు. అక్కడికక్కడ రూ.3లక్షలు చెల్లించాలని నిర్బంధించారు. బోడసకుర్రులోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకువెళ్లి రబ్బరు ట్యూబు, కర్ర, కొబ్బరి మట్టలతో దాడి చేశారు. ఉదయ్‌శంకర్ స్వల్పంగా గాయపడ్డాడు. మహేష్‌పై అమానుషంగా దాడి చేశారు. బీరు బాటిల్ పగులకొట్టి పొడిచేందుకు, నదిలో తోసేసేందుకు ప్రయత్నం చేశారు. అలా రెండుమూడు చోట్లకు తీసుకెళ్లి మహేష్, ఉదయ్‌శంకర్‌లపై దాడి చేశారు. ఆ సమయంలో మహేష్ సోదరుడు 112కు ఫోన్ చేసి సమాచారం అందించాడు. వెంటనే పట్టణ సీఐ పి.వీరబాబు తీవ్రంగా గాయపడ్డ దోనిపాటి మహేశ్వరరావును అమలాపురం ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ మహేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్ఐ పి.శ్రీనివాస్ కేసు నమోదు చేశారు. డీఎస్పీ ప్రసాద్ దర్యాప్తు చేసి కీలక ఆధారాలను సేకరించామన్నారు. ఈ కేసుకు సంబంధించి అమలాపురం శ్రీరామపురం ప్రాంతానికి చెందిన యల్లమిల్లి విజయ్‌రవిశంకర్, ఈదరపల్లి గ్రామానికి చెందిన ఉరదల బాలరాజు, విజయనగరం జిల్లా భోగాపురం ప్రాంతానికి చెందిన యర్రా కృష్ణను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్టు డీఎస్పీ తెలిపారు. వారి వద్ద నుంచి ఆటో, రబ్బరు ట్యూబులు, దాడికి ఉపయోగించిన ఇతర పరికరాలను స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ పేర్కొన్నారు. ఈ కేసులో పరారైన ముగ్గురు నిందితుల కోసం బృందాలను నియమించినట్టు ఆయన తెలిపారు.

రేపటి నుంచి సత్యదేవుడి 135వ ఆవిర్భావ వేడుకలు

అన్నవరం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడి ఆవిర్భావ దినోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభంకానున్నాయి. స్వామివారు ఖరనామసంవత్సర శ్రావణ శుద్ధ విదియరోజున (1891 ఆగస్టు 6న) స్వయంభువుడుగా వెలిశారు. దీంతో ఏటా శ్రావణశుద్ధ పాడ్యమి, విదియ తిదులలో రెండురోజులు పాటు విశేషపూజలు, ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం సంప్రదాయంగా వస్తుంది. స్వామి 135వ ఆవిర్భావ దినోత్సవాలు పురస్కరించుకుని

2 రోజులపాటు విశేష పూజలు

శుక్రవారం ఉదయం 9గంటలకు గణపతిపూజ, పుణ్యాహవచనం, కలశస్థాపన దీక్షా వస్త్రధారణ, తదితర కార్యక్రమాలతో పాటుగా హోమాలు, జపములు, పారాయణలు నిర్వహిస్తారు. శనివారం మూలవిరాట్‌లకు పంచామృతాభిషేకాలు, మహాన్యాసపూర్వక రుద్రాభిషేకాలు, ఆయుష్యహోమం నిర్వహించి రథోత్సవం నిర్వహించనున్నారు. కార్యక్రమాలకు భక్తులు విచ్చేసి జయప్రదం చేయాలని ఈవో సుబ్బారావు కోరారు.

ఒకేసారి ఐదు స్వర్ణ పతకాలు

ఎన్జీ రంగా యూనివర్శిటీ స్నాతకోత్సవంలో అందుకోనున్న జ్వాల


మోర్త జ్వాల

అమలాపురం రూరల్, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్శిటీ నుంచి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మండలం నల్లమిల్లికి చెందిన మోర్త జ్వాల ఒకేసారి ఐదు స్వర్ణ పతకాలు సాధించింది. ఎన్జీ రంగా యూనివర్శిటీలో 2023 బ్యాచ్‌కు చెందిన జ్వాల బీఎస్సీ అగ్రికల్చర్ ఆనర్స్ చదివింది. అప్పట్లో యూనివర్శిటీ టాపర్‌గా నిలిచిన జ్వాలకు ఒకేసారి ఐదు స్వర్ణ పతకాలు అందజేయనున్నట్టు యూనివర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామచంద్రరావు లేఖ పంపించడంతో ఆ ఇంట ఆనందానికి అవధుల్లేవు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం 57వ స్నాతకోత్సవాన్ని గురువారం విజయవాడ సమీపంలోని ఆత్కూరు స్వర్ణభారతి ట్రస్టులో నిర్వహించనున్నారు. యూనివర్శిటీ కాన్వొకేషన్‌లో భాగంగా జ్వాలకు శ్రీనీలంరాజు గంగాప్రసాదరావు అండ్ కమల గోల్డ్ మెడల్, శ్రీపరిశాయానాది మెమోరియల్ గోల్డ్ మెడల్, మణిమట్లపూడి మెమోరియల్ గోల్డ్‌మెడల్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గోల్డ్‌మెడల్, శ్రీరాజా ఇమ్మానియేల్‌రాయల్ కొండేటి గోల్డ్‌మెడల్‌ను అందించనున్నారు. 57వ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్‌నజీర్ హాజరుకానున్నారని, ఆయన చేతులమీదుగా జ్వాల స్వర్ణ పతకాలను అందుకోవడం ఎంతో ఆనందంగా ఉందని తండ్రి మోర్త శ్రీనివాసరావు తెలిపారు. ప్రస్తుతం జ్వాల బెంగుళూరు ఐఐఎంలో చదువుకుంటుంది. ఆమె స్నాతకోత్సవానికి హాజరుకానున్నట్టు తండ్రి తెలిపారు.

గోర్సలో గ్రామస్తుల ఆందోళన

దేవాలయ భూముల్లో ఆక్రమణదారులు సాగు చేయడానికి వీలులేదని బైఠాయింపు


కాకినాడ జిల్లా గోర్స దేవాలయం భూమిలో ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

కొత్తపల్లి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం గోర్స గ్రామంలోని సీతారామస్వామి ఆలయ భూములను ఆక్రమణదారులు సాగు చేయడానికి వీలులేదని దేవదాయశాఖ అధికారులు న్యాయస్థానం నుంచి స్టే తెచ్చారు. స్టే ఆర్డర్‌ను లెక్కచేయకుండా సీతారామస్వామి ఆలయ భూములను ఆక్రమించిన పలువురు కౌలు రైతులు బుధవారం ఆలయ భూముల్లో వరినాట్లు వేసేందుకు సమాయత్తమయ్యారు. గ్రామానికి చెందిన శ్రీసీతారామస్వామికి చెందిన సర్వే నంబరు 121, 122లో 19 ఎకరాల 92 సెంట్లు భూమిని ఆక్రమణదారులు సాగు చేయడం దానిపై దేవదాయశాఖ అధికారులు ఆ భూమి దేవాలయానికి చెందినదే అని న్యాయస్థానంలో కేసులు వేయడం విధితమే. దీనిలో భాగంగా న్యాయంస్థానం దేవాలయానికి చెందిన భూముల్లో ఎవరూ సాగుచేయరాదని స్టే విధించడం, దాన్ని ఖతరు చేయకుండా ఆక్రమణదారులు సాగు చేయాడానికి ప్రయత్నించడంతో గ్రామస్తులు పొలాల మధ్యలో ఆలయ భూములున్న చోట బైఠాయించి ఆందోళన చేపట్టారు. సీతారామస్వామి ఆలయానికి చెందిన భూములని అన్ని ఆధారాలున్నా సంబంధిత అధికారులు పట్టించుకో వడంలేదని, ఈ విషయమై ఉప ముఖ్య మంత్రి పవన్‌కళ్యాణ్ ప్రత్యేక దృష్టి సారించి దేవాలయ భూములను ఆక్రమణదారుల చెర నుంచి విడుదల చేయించాలని గ్రామస్తులు కోరారు. విషయం తెలుసుకున్న కొత్తపల్లి ఎస్ఐ జి.వెంకటేష్ సిబ్బందితో ఆందోళన చేస్తున్న ప్రాంతానికి వెళ్లారు. గ్రామస్తులు, ఆక్రమణదారులతో చర్చించారు. దేవాలయ భూముల్లోకి అనుమతి లేకుండా ఎవరూ ప్రవేశించరాదని నచ్చచెప్పి ఆందోళన విరమింపచేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

మూడేళ్ల బాలుడి మృతి కేసులో... అంగన్వాడీ కార్యకర్త, ఆయాకు జైలు శిక్ష

కాట్రేనికోన, జూలై 23 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కేంద్రంలో సిబ్బంది నిర్లక్ష్యం వల్ల మూడేళ్ల బాలుడు పంటకాల్వలో పడి మరణించిన కేసులో ఇద్దరికి జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు చెప్పింది. కాట్రేనికోన ఎస్ఐ అవినాష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం పల్లంకుర్రు పంచాయతీ మొక్కలతిప్పలో 2019లో అంగన్వాడీ కేంద్రంలో మూడేళ్ల బాలుడు పక్కనే ఉన్న పంటకాల్వలో పడి చనిపోయాడు. అప్పట్లో అంగన్వాడీ కార్యకర్త వెంట్రు శ్రీరమణ, ఆయా రేవు నాగమణిపై కేసు నమోదైంది. కేసులో వాదోపవాదాలు పూర్తయిన అనంతరం బుధవారం ముమ్మిడివరం జేఎఫ్‌సీఎం కోర్టు న్యాయమూర్తి మహ్మద్ రెహ్మాతుల్లా తీర్పు వెలువరించారు. నిందితులు ఒక్కొక్కరికి ఏడాది జైలు, రూ.5వేలు జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. అప్పట్లో ఈ కేసును ఎస్ఐ పి.సత్యనారాయణరెడ్డి దర్యాప్తు చేశారు. ప్రాసిక్యూషన్ పక్షాన ఏపీపీ దాసరి నాగరాజు వాదనలు వినిపించారు.

విశ్వవిద్యాలయాలు, సాంకేతిక సంస్థల సహకారం అవసరం : వీసీ



నన్నయ విశ్వవిద్యాలయంలో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): స్థిరమైనభూగర్భజల నిర్వహణను నిర్ధారించడానికి విశ్వవిద్యాలయాలు, సాంకేతిక సంస్థల మధ్య శాస్త్రీయ, సమాజ ఆధారిత సహకారాలు అవసరమని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. హైదరాబాద్‌లోని కేంద్ర భూగర్భజలబోర్డు దక్షిణ ప్రాంతం వారు టైర్2 శిక్షణా కార్యక్రమాన్ని తూర్పు గోదావరి జిల్లా నన్నయ విశ్వవిద్యాలయంలో బుధవారం ప్రాంభించారు. జిల్లాలో భూగర్భజలాల స్థిరమైన నిర్వహణ అనే అంశంపై 3రోజుల శిక్షణా కార్యక్రమాన్ని వీసీ ప్రాంభించారు. ఆమె మాట్లాడుతూ కాలుష్యం, కాలానుగుణ వైవిధ్యం వంటి పునరావృత సమస్యలను తెలిపారు. ఈ ప్రాంతంలో నీటిసంరక్షణ కీలకమైన అవసరాన్ని వివరించారు. సంప్రదాయ గిరిజన నీటి పద్ధతులను ప్రస్తావించారు. కేంద్ర భూగర్భ జలబోర్డు ప్రాంతీయ డైరెక్టర్ జ్యోతికుమార్ మన రాష్ట్ర భూగర్భజల స్థితిగతులు, కేంద్రభూగర్భజలమండలి వంటి విషయాలను వివరించారు. డిప్యూటీ డైరెక్టర్ వై.శ్రీనివాస్ తూర్పుగోదావరి జిల్లా భూగర్భజలాల పరిస్థితులను విశ్లేషించారు. భూగర్భజలాల శాస్త్రవేత్త డాక్టర్ ఎం.సుధీర్ కుమార్ ప్రాథమిక భూగర్భజలాల పరిస్థితులను వివరించారు. నన్నయ విశ్వవిద్యాలయం భూగర్భ జలన్వేషణ, రీచార్జ్ పద్ధతులు అనే నివేదిక పుస్తకాన్ని వీసీ ఆవిష్కరించారు. నన్నయ విశ్వవిద్యాలయం జియోసైన్సెస్ విభాగాలతో పాటు ఉమ్మడి గోదావరి జిల్లాలోని పలు కళాశాలల నుంచి జియాలజీ విభాగం విద్యార్థులు, అధ్యాపకులు హాజరయ్యారు. కార్యక్రమంలో సీనియర్ శాస్త్రవేత్తలు టి.మాధవ్, పి. రేష్మా, పి. యాదయ్య, ఎస్.సరిత, టి.వెంకటగిరి, డి.అనంతరావు, నన్నయ రిజిస్ట్రార్ ఆచార్య కె.వి.స్వామి, ప్రిన్సిపాల్ పి.విజయనిర్మల, జియోసైన్సెస్ విభాగాధిపతి వై.శ్రీనివాసరావు, అధ్యాపకులు నూకరత్నం, కె.ఎస్.పీటర్, కె.సుధారాణి ఉన్నారు.

'కేబుల్ వ్యవస్థలో పెరిగిన ధరలు తగ్గించాలి'


రావులపాలెంలో మాట్లాడుతున్న రమ్మి సురేష్

రావులపాలెం, జూలై 23(ఆంధ్రజ్యోతి): కేబుల్ వ్యవస్థలో పెరిగిన ధరలు వెంటనే తగ్గించాలని, ఇది ఉమ్మడి జిల్లాలోని మండల స్థాయి ఆపరేటర్స్ ఐక్యతగా ఉండటం ద్వారానే సాధించుకోవచ్చని మల్టీసర్వీసెస్ కేబుల్ ఆపరేటర్స్ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వెంకట్రావు అన్నారు. కోనసీమ జిల్లా రావులపాలెంలో జిల్లా అధ్యక్షుడు కర్రి రామకృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉమ్మడి తెలుగు రాష్ట్రాల కన్వీనర్ రమ్మి సురేష్, వెంకట్రావు మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలోని మండల ఇన్‌చార్జ్‌లు చానల్ రేట్లు దిగి రావడం కోసం నిరసన వ్యక్తం చేయడం ఆనందదాయకమన్నారు. యూనియన్ పిలుపు మేరకు త్వరలో ఎంఎస్వోలు, బ్రాడ్‌కాస్టర్లు రేట్లు తగ్గించకపోతే సమష్టిగా పోరాటం చేసి రేట్లు తగ్గించే వరకూ నిరసన వ్యక్తం చేయడానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వం అమలు చేసిన విధానాలతో ఆపరేటర్లు తీవ్రంగా నష్టపోయారని దీనిపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ ఎం.లక్ష్మీప్రసాద్, కోశాధికారి డి.గోవిందరాయులు, మండల ఇన్‌చార్జ్‌లు ఉన్నారు.

పెద్దాపురంలో వ్యభిచారగృహ నిర్వాహకురాలికి సహకారం
కానిస్టేబుల్, హోంగార్డ్ సస్పెన్షన్

ఎస్ఐ, పోలీస్ అధికారులపై క్రమశిక్షణా చర్యలకు కాకినాడ జిల్లా ఎస్పీ సిఫార్సు

కాకినాడ క్రైం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పెద్దాపురంలో వ్యభిచారగృహ నిర్వాహకురాలికి సహకరించారనే అభియోగం విచారణలో నిగ్గుతేలడంతో కానిస్టేబుల్, హోంగార్డ్‌పై సస్పెన్షన్ వేటు వేస్తూ కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. పెద్దాపురంలో వ్యభిచారగృహంలో విటులు దొరికినా పట్టుకోకుండా నిర్వాహకురాలు భారతికి స్థానిక పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ జి.శివరామకృష్ణ, హోంగార్డ్ సీహెచ్.శివకృష్ణ సహకరిస్తున్నారని అందిన ఫిర్యాదు మేరకు శాఖాపరంగా విచారణ చేపట్టిన దర్యాప్తు అధికారులు సమర్పించిన నివేదిక ఆధారంగా కానిస్టేబుల్, హోంగార్డ్‌ను ఎస్పీ సస్పెండ్ చేశారు. అలాగే పెద్దాపురం ఎస్ఐ వి.మౌనికపై క్రమశిక్షణా చర్యలు, అలాగే మరికొంతమంది పెద్దాపురం సబ్ డివిజన్‌లోని పోలీస్ అధికారులపై క్రమశిక్షణా చర్యలకు ఉన్నతాధికారులకు ఎస్పీ సిఫార్సు చేశారు. పెద్దాపురం పరిసర ప్రాంతాల్లో వ్యభిచారం జరగకుండా నిరంతర దాడులు చేయడం జరుగుతుందని ఎస్పీ విడుదల చేసిన ప్రకటనలో స్పష్టం చేశారు.

వ్యభిచార గృహాలపై దాడి

పెద్దాపురం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం పట్టణంలో వ్యభిచార గృహాలపై పోలీసులు బుధవారం ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. పెద్దాపురం, ప్రత్తిపాడు, జగ్గంపేటకు చెందిన పోలీసులు అధికారుల బృందం స్థానిక మసీదు సెంటర్, వక్కలంకవారి వీధిలో ఈ దాడులు చేపట్టారు. ఈ దాడుల్లో నందిగిరి దుర్గ, ప్రత్తిపాటి జీవన్‌ను అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేసినట్టు డీఎస్పీ శ్రీహరిరాజు తెలిపారు. వ్యభిచార గృహాలు నిర్వహించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. దాడుల్లో సీఐ విజయశంకర్, ఎస్ఐ మౌనిక పాల్గొన్నారు.

కోర్టులో హాజరైన జనసేన నేతలు


కాకినాడలో కోర్టులో హాజరయ్యేందుకు వెళ్తున్న జనసేన నేతలు

కాకినాడ క్రైం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, డీసీసీబీ చైర్మెన్ తుమ్మల బాబుతో పాటు జనసేన నాయకులు బుధవారం కాకినాడ రెండో అదనపు జూనియర్ సివిల్ కోర్టులో వాయిదాకు హాజరయ్యారు. వివరాల్లోకి వెళితే వైసీపీ ప్రభుత్వ హయాంలో కాకినాడ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని ఖండిస్తూ కందుల దుర్గేష్ ఆధ్వర్యంలో కాకినాడ భానుగుడి కూడలిలో జనసేన నాయకులు, కార్యకర్తలు శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తుండగా పోలీసులు అక్రమ కేసులు పెట్టి అరెస్టులు చేసి కోర్టులో హాజరుపర్చారు. అప్పటి నుంచి జనసేన నేతలు కోర్టు వాయిదాలకు హాజరవుతున్నారు. అందులో భాగంగా బుధవారం కోర్టుకు హాజరయ్యారు.

మున్సిపాల్టీ సొమ్ములు వాడుకున్న ఉద్యోగిని అరెస్టు

భర్తను పట్టుకున్న పోలీసులు

తునిరూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీకి పన్నుల రూపంలో వచ్చిన సొమ్ములు వాడుకున్న ఉద్యోగిని బుధవారం తుని పోలీసులు అరెస్టు చేశారు. తుని టౌన్ సీఐ గీతారామకృష్ణ వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా తుని టౌన్ మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో క్లర్కుగా పనిచేస్తున్న మంగు సునీత 2024 డిసెంబరు నుంచి 2025 ఏప్రిల్ వరకు మున్సిపాల్టీకి చెందిన వివిధ రకాల పన్నుల రూపంలో వసూలు చేసిన సుమారు రూ.26లక్షలకు పైగా సొంతంగా వాడుకుంది. దీనిపై ఫిర్యాదు రావడంతో ఆమెపై కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా బుధవారం సునీత, భర్త విశ్వనాధను అరెస్టు చేశారు. సునీత చేసిన అప్పులు తీర్చుకోవడానికి, భర్త రియల్ ఎస్టేట్ వ్యాపారానికి సొమ్ములు వాడుకున్నట్టు తెలిపారు. విశ్వనాధ పాస్‌పోర్టు స్వాధీనం చేసుకున్నామని, ఈ కేసులో విచారణ కొనసాగుతుందని సీఐ తెలిపారు.

గుమ్మడికాయల మాటున గోవుల అక్రమ తరలింపు

డ్రైవర్‌పై కేసు

జగ్గంపేట/కిర్లంపూడి, జూలై 23(ఆంధ్రజ్యోతి): గుమ్మడికాయల మూటల మాటున గోవులను ఉంచి అక్రమంగా తరలిస్తుండగా కిర్లంపూడి పోలీసులు బుధవారం పట్టుకున్నారు. జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలంలోని కృష్ణవరం టోల్‌గేట్ వద్ద కిర్లంపూడి ఎస్ఐ జి.సతీష్, సిబ్బంది వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానస్పదంగా ఉన్న గుమ్మడికాయల లోడు వ్యాన్‌ను పరిశీలించారు. వ్యాన్ కింద ఒక అర ఏర్పాటు చేసి గోవులను ఉంచినట్టు గుర్తించారు. గుమ్మడికాయలు మూటలు కిందకు దించి చూడగా అందులో 2 గోవులు, 8 ఎద్దులు ఉన్నాయి. వాటిని వ్యాన్‌తో పాటు కిర్లంపూడి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని సీఐ పేర్కొన్నారు.

అమలాపురం

జీతాల పెంపుపై హర్షం


ముమ్మిడివరం, జూలై 23(ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీ ఇంజనీరింగ్ విభాగంలో పనిచేసే ఒప్పంద కార్మికులు న్యాయబద్ధమైన కోర్కెలు తీర్చాలంటూ చేసిన సమ్మె కారణంగా సీఎం చంద్రబాబు, మున్సిపల్ శాఖా మంత్రి నారాయణ స్పందించి సమస్యలు పరిష్కరించడంతో పాటు వేతనాలు పెంచడం పట్ల కార్మికులు హర్షం వ్యక్తం చేశారు.

శాకంబరిగా గ్రామదేవతలు.. సారె సమర్పణ

- ఆలయాల్లో అభిషేకాలు, పూజలు
- స్వీట్లు, కుంకుమ, పసుపు సమర్పణ







అమలాపురం గ్రామదేవత సుబ్బాలమ్మతల్లి, ముమ్మిడివరం: పుట్లమ్మతల్లికి సారె, అల్లవరం చింతాలమ్మ, యానాం: శ్రీమహాలక్ష్మి తల్లి, మామిడికుదురు: ఈదరాడ పాళ్లమ్మ

అమలాపురం రూరల్, జూలై 23(ఆంధ్రజ్యోతి): అమలాపురం గ్రామదేవత శ్రీసుబ్బాలమ్మ అమ్మవారికి ఆషాఢమాసం సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలతో అమ్మవారిని శాకంబరిగా అలంకరించారు. వందలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. దేవస్థానం మాజీ చైర్మన్ పెద్దిరెడ్డి సాయిపుల్లయ్యనాయుడు, దేవస్థానం సిబ్బంది భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేశారు. సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నల్లమిల్లిలో వనువులమ్మ తల్లికి ఆషాఢం సారె సమర్పించారు. అమ్మవారికి పసుపునీళ్ల సమర్పించారు. దేవాలయ కమిటీ, హారతి మహిళా ప్రతినిధులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో సారెతో గ్రామోత్సవం నిర్వహించారు. అమ్మవారికి వివిధ రకాల స్వీట్లు, పండ్లు, చీర, సారె సమర్పించారు. అమలాపురం శ్రీదేవి అమ్మవారికి భక్తులు సారె సమర్పించారు. స్థానిక శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద నుంచి వందలాది మంది మహిళలు చీర, సారెతో ఊరేగింపు నిర్వహించి శ్రీదేవి అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. అమలాపురం ఆర్టీసీ బస్టాండు వద్ద శ్రీసుబ్బాలమ్మతల్లి ఆటో ఓనర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆషాఢం జాతర సేవ నిర్వహించారు. బస్టాండు సెంటర్ నుంచి అమ్మవారి ఆలయం వద్దకు భారీ ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు బొంతు వెంకటేష్, ఉపాధ్యక్షుడు దున్నాల వీరబాబు, కార్యదర్శి అమలదాసుచంటి, కోశాధికారి నేల సత్యనారాయణ పాల్గొన్నారు.

శాకంబరిగా అమ్మవార్లు

మామిడికుదురు, జూలై 23(ఆంధ్రజ్యోతి): ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యం, సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని కోరుతూ మండలంలోని పలు గ్రామాల్లో అమ్మవార్లను బుధవారం శాంకబరిగా అలంకరించారు. ఈదరాడలోని పాళ్లమ్మ, లూటుకుర్రులోని పళ్లాలమ్మ, పాశర్లపూడిలోని మహాలక్ష్మమ్మ, వనువులమ్మ అమ్మవార్లను వివిధ రకాల కూరగాయలు, పుష్పాలు, పండ్లతో శాకంబరిగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం ఆయా గ్రామాల్లో ప్రజలు మేళతాళాలు, భక్తుల కోలాహలం, గరగ నృత్యాల నడుమ సారె, పసుపు, కుంకుమ, పువ్వులు, చలిమిడి, వడపప్పు, పానకాలు, గాజులు, వివిధ రకాల స్వీట్లు, పండ్లతో భారీ ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవార్లకు సమర్పించారు. ఆయా గ్రామాల్లో అధిక సంఖ్యలో భక్తులు పూజల్లో పాల్గొన్నారు.

గ్రామదేవతలకు చీరలు సమర్పణ

అల్లవరం, జూలై 23(ఆంధ్రజ్యోతి): అల్లవరం గ్రామదేవతలు చింతాలమ్మ, ఆదిలక్ష్మి, కనకదుర్గమ్మవార్లకు ఆషాఢ మాసం సందర్భంగా బుధవారం మహిళలు చీరలు, గాజులు, మిఠాయి, సారెలు సమర్పించారు. మహిళలు డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా వచ్చి గ్రామదేవతలకు మొక్కులు చెల్లించి పూజలు చేశారు. వివిధ రకాల మిఠాయిలు అమ్మవార్లకు సమర్పించారు.

కనకమహాలక్ష్మికి సారె

రాజోలు, జూలై 23(ఆంధ్రజ్యోతి): కడలిలో శ్రీకనక మహాలక్ష్మి అమ్మవారికి ఆషాఢ మాసం సందర్భంగా గ్రామంలో ఉన్న బీసీ సంఘాలకు చెందిన వివిధ ఆలయ కమిటీల ఆధ్వర్యంలో బుధవారం సారె సమర్పించారు. వంద కిలోల 36రకాల స్వీట్లను అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. అధికసంఖ్యలో మహిళలు తరలివచ్చి అమ్మవారికి పసుపు కుంకుమలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీరామ యువజన సంఘం, శ్రీవిజయదుర్గ యువజనసంఘం, కోదండరామ యువజనసంఘం, వెంకటేశ్వరా యువజనసంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మరిడమ్మకు సారె

ఐ.పోలవరం, జూలై 23(ఆంధ్రజ్యోతి): సమరసత ఫౌండేషన్ నిర్మించిన బాణాపురం ఆలయంలో మరిడమ్మ తల్లికి బుధవారం గ్రామ ఆడపడుచులు ఆషాఢం సారె సమర్పించారు. మహిళలు అమ్మవారికి ముడుపులు చెల్లించుకున్నారు. పసుపు, కుంకుమ, చలిమిడి, పానకాలు, వివిధ రకాల స్వీట్లతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో బొంతు కనకారావు, వీరభద్ర రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

పుట్లమ్మ తల్లికి చీర

ముమ్మిడివరం, జూలై 23(ఆంధ్రజ్యోతి): సీహెచ్ గున్నేపల్లి దేవరపల్లి గ్రామంలోని పుట్లమ్మవారికి గ్రామస్తులు బుధవారం సారె, చీర సమర్పించారు. ఆషాఢ మాసం సందర్భంగా గ్రామస్తులు బ్యాండుమేళాలు, బాణసంచా కాల్పులతో అమ్మవారికి సారె, చీరలు, పానకం, చలిమిడి, పండ్లు నైవేద్యంగా సమర్పించారు. అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

తాటెమ్మ తల్లికి సారె

పి.గన్నవరం, జూలై 23(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం గ్రామదేవత శ్రీతాటెమ్మ తల్లికి గ్రామఆర్య వైశ్య సంఘ సభ్యులు బుధవారం సారెను సమర్పించారు. తొలుత స్థానిక గరుడేశ్వరస్వామి ఆలయం నుంచి ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజల అనంతరం వివిధ రకాల స్వీట్లు, పండ్లు అమ్మవార్కి సమర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు పాటోలు కృష్ణమూర్తి, ఆర్య వైశ్య సంఘ డైరెక్టర్ తమ్మన ప్రసాద్, శిరం వరహాలరావు, బలభద్ర మోహనరావు, వంకాయల బాలయ్య, బ్రాహ్మనందం, గంగరాజు, కూరపాటి కృష్ణ, శిరం నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవార్లకు సారె సమర్పణ

యానాం, జూలై 23(ఆంధ్రజ్యోతి): యానాం-ద్రాక్షారామ రోడ్డులోని కొలువై ఉన్న యానాం గ్రామదేవతలు శ్రీమహాలక్ష్మమ్మ, పోలేరమ్మ అమ్మవార్లకు ప్రముఖ వ్యాపారవేత్త కాపగంటి జయబాబు కుటుంబ సభ్యులు ఆషాఢం సారె సమర్పించారు. పసుపు, కుంకుమ, వివిధ రకాల పిండి వంటలు, స్వీట్లు, పండ్లు, చలివిడి, పానకంతో ఆషాఢం సారెను ఊరేగింపుగా అమ్మవారికి ఆలయానికి తీసుకువెళ్లారు. అనంతరం ఆలయంలో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి అమ్మవార్లకు సారెను సమర్పించారు. కార్యక్రమంలో కాపగంటి పవన్, సుమన్ పాల్గొన్నారు.

అమ్మవారికి సారె

ముమ్మిడివరం, జూలై 23(ఆంధ్రజ్యోతి): అయినాపురం గ్రామదేవత శ్రీనీలాలమ్మతల్లి, శ్రీఆదిలక్ష్మమ్మ అమ్మవారికి గ్రామస్తులు సారెను సమర్పించారు. గ్రామం పాడిపంటలు, సిరిసంపదలతో తులతూగాలని దేశం, రాష్ట్రం ఎల్లప్పుడూ సుభిక్షంగా ఉండాలని, అందరూ సుమంగళిగా పుసుపు, కుంకుమలు, భోగభాగ్యాలతో వర్థిల్లాలని కోరుతూ పసుపు, కుంకుమ, చలిమిడి, వడపప్పు, పానకాలు, పట్టువస్త్రాలు, నిమ్మకాయ దండలు, పలు రకాల స్వీట్లు, పండ్లతో మహిళలు అమ్మవార్లకు మేళతాళాలు, భాజాభజంత్రీలు, బాణసంచా కాల్పులతో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని వాటిని సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. అమ్మవారిని కూరగాయలు, పండ్లతో అలంకరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రావులమ్మకు సారె

అంబాజీపేట, జూలై 23(ఆంధ్రజ్యోతి): వాకలగరవు గ్రామదేవత శ్రీరావులమ్మ అమ్మవార్ని అషాఢ మాసం సందర్భంగా వివిధ రకాల స్వీట్లు, పండ్లు, పసుపు, కుంకుమ, గాజులతో సారె సమర్పించారు.గ్రామస్తులు, మహిళలు సారెను ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. అనంతరం అమ్మవార్కి సమర్పించి ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవార్ని భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. గ్రామమంతా ఆడపడుచులతో కళకళలాడింది. అమ్మవార్ని నాయకులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ముళ్ల పొదలతో ప్రయాణం నరకమే

కొమరగిరిపట్నం రోడ్డు అధ్వానం



రోడ్డుపైకి వచ్చిన ముళ్లతుమ్మ పొదలు

అల్లవరం, జూలై 23(ఆంధ్రజ్యోతి): ముళ్ల పొదలు మూసుకుపోవడంతో ఈరోడ్డులో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ముళ్ల పొదలు రోడ్డును మూసివేశాయి. కొమరగిరిపట్నం నుంచి ఓడలరేవు బీవీసీ కళాశాలకు వెళ్లే రోడ్డులో రహదారి పక్కన ముళ్ల పొదలు భారీగా పెరిగాయి. ముళ్ల పొదలురోడ్డుపైకి వచ్చి మూసివేయడంతో అటుగా వాహనాలు వెళ్లాలంటే ఇబ్బందిగా మారింది. ఈరోడ్డులో విద్యా సంస్థల బస్సులతో పాటు వందలాది మోటారుసైకిళ్లపై విద్యార్థులు, రైతులు, ప్రజలు వెళుతున్నారు. మూసుకుపోయిన ముళ్లపొదలు గీరుకుని అనేక మంది గాయాల పాలవుతున్నారు. రోడ్డును మూసివేసిన ముళ్ల పొదలను తొలగించడంలో సంబంధిత అధికారులు, పంచాయతీలు పట్టించుకోవడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రమాదాలు జరగకుండా ముళ్ల పొదలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకర పంటలు



వక్కలంకలో ప్రకృతి వ్యవసాయంపై రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్

అంబాజీపేట, జూలై23(ఆంధ్రజ్యోతి): ప్రకృతి సేద్య ఆహార ఉత్పత్తులు ఆరోగ్యానికి ఎంతో మేలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అన్నారు. అంబాజీపేట మండలం వక్కలంక గ్రామంలో జీవామృతం, ఆవుమూత్రం, పేడతో తయారు చేసే ఘనజీవామృతాల తయారీ కేంద్రాన్ని, ఏపీ సీఎన్ఎఫ్ ప్లాట్స్‌ను ఆయన సందర్శించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పురుగు మందుల వాడకానికి ప్రత్యామ్నాయంగా జీవామృతం, వేప కషాయం ఉపయోగించి ఆరోగ్యవంతమైన ఉత్పత్తులను పండించవచ్చన్నారు. పురుగు మందులు, రసాయన ఎరువులు ఉపయోగించకుండా నేల శక్తిని గరిష్టంగా వినియోగించి ఆరోగ్యకర, నాణ్యమైన పంటలను సమృద్ధిగా ఉత్పత్తి చేయడమే ప్రకృతి సేద్య వ్యసాయ పద్ధతి అన్నారు. ఘన జీవామృత కషాయ కేంద్రంలో ఉత్పత్తుల తయారీ విధానాలను ఆయన పరిశీలించారు. జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయానికి ఉపయోగపడే సేంద్రియ ఎరువులు, ద్రవణాలు, ఎరువులు రైతులు తయారు చేసుకోవడం చాలా కష్టసాధ్యమైన పని అని, అందుకు ప్రత్యామ్నాయంగా ప్రకృతి జీవామృత కేంద్రాలు స్థాపించడం శుభ పరిణామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, నీటిపారుదల శాఖ డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, అరిగెల సూరిబాబు, తహశీల్దారు చినబాబు, ఏవోలు ధర్మరావు, శ్రీనివాసరావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది జనుపల్లి నాగవేణి పాల్గొన్నారు.

కుటుంబ సంక్షేమమే సుపరిపాలన లక్ష్యం



ఇంటింట ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

ఉప్పలగుప్తం, జూలై 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అన్ని కుటుంబాల సంక్షేమమే సుపరిపాలన లక్ష్యమని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. బుధవారం ఉప్పలగుప్తం, కామరాజుపేట గ్రామాల్లో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం జరిగింది. ఈకార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి సుపరిపాలనపై మహిళల అభిప్రాయాలను తెలుసుకున్నారు. టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు చిక్కం కాసు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు అరిగెల నానాజీ, ప్రధాన కార్యదర్శి పందు వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు నల్లా బాబండి, చిక్కం జంగమయ్య, ఎంపీటీసీ తాళ్ళ లలితారవి, సొసైటీ చైర్మన్ చిక్కం ఉమేష్, కూటమి నాయకులు మెట్ల రమణబాబు, పెయ్యల దుర్గారావు, ఇసుకపట్ల రఘుబాబు, రవణం మధు, గాలిదేవర సురేష్, మధుర నరసింహమూర్తి, కంకటాల రామం, సలాది శ్రీనివాసరావు, మల్లాడి వెంకటరమణ, గుత్తుల నాగేశ్వరరావు, పెమ్మిరెడ్డి సత్యనారాయణ, కడలి శ్రీనివాసరావు, చీకట్ల ఏసు, సలాది పట్టాభి, నిమ్మకాయల సూర్యప్రకాష్, గుత్తుల శ్రీనివాసరావు, నిమ్మకాయల వెంకటరామారావు, నూకల రాజా, కుంచే రాజేష్ పాల్గొన్నారు.

నవోదయలో క్లస్టర్ లెవెల్ క్రీడా పోటీలు ప్రారంభం

యానాం, జూలై 23(ఆంధ్రజ్యోతి): యానాం మెట్టకుర్రులోని జవహర్ నవోదయ విద్యాలయంలో బుధవారం క్లస్టర్ లెవెల్‌వాలీబాల్, బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఎనిమిది జిల్లాల నవోదయ విద్యార్థులతో రెండు రోజులు జరిగే పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీపాద శరశ్చంద్రకీర్తి క్రీడా పతాకాన్ని ఎగురవేసి క్రీడాకారుల నుంచి గౌరవవందనం స్వీకరించారు. అనంతరం విద్యార్థులతో క్రీడా ప్రతిజ్ఞ చేయించారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, భద్రాచలం, గుంటూరు, యానాం జిల్లాలకు చెందిన 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయురాలు సి.లక్ష్మీ ప్రసన్న, ఎం.సింహాచలం, ఉపాధ్యాయులు సంహాద్రి అప్పన్న, యు.జయప్రకాష్, ఎస్.శంకరరావు, తదితర ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దళితుడిపై దాడిచేసిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలి

అమలాపురంటౌన్,జూలై23(ఆంధ్రజ్యోతి): దళితుడు దోనిపాటి మహేష్‌పై అమానుషంగా దాడిచేసిన వారిని తక్షణం అరెస్టుచేసి కఠినంగా శిక్షించాలని భారత రిపబ్లికన్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. దోనిపాటి మహేష్ కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మహేష్‌కు న్యాయం జరిగే వరకు ఉద్యమిస్తామని హెచ్చరించారు. కలెక్టర్ మహేష్‌కుమార్‌కు వినతిపత్రం అంద జేశారు. ఆర్పీఐ నాయకులు ఎన్ఎం రుషి, చీకురుమెల్లి శ్రీనివాస్, దేవరపల్లి ఏడుకొండలు, ఉచ్చుల సాల్మన్‌రాజు, బడుగు రాంబాబు పాల్గొన్నారు.

'స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలి'



స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని ఇంటింటికీ ప్రచారం

ముమ్మిడివరం, జూలై 23(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్లను ఇంటికి బిగించకుండా అడ్డుకోవాలని సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ముమ్మిడివరం నగర పంచాయతీ బొండాయి కోడు తూము, సీతారాంపేట, 13వ వార్డులలో ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు జి.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల వాడకం వల్ల సెల్‌ఫోన్ పద్ధతిలో మాదిరిగా ముందుగా డబ్బులు చెల్లించి రీచార్జ్ చేయించుకోవాల్సి ఉంటుందన్నారు. దీనివల్ల ఇంటికి వచ్చి రీడింగ్ తీసే పద్ధతి కానీ, బిల్లుల రూపంలో ఇవ్వడం కానీ జరగదన్నారు. అదానీ కంపెనీ ఆన్‌లైన్‌లోనే రీడింగ్‌చూసి ఆన్‌లైన్‌లోనే బిల్లులు పంపుతుందన్నారు. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం విద్యుత్ సంస్కరణ పేరుతో కేంద్ర విద్యుత్ చట్టానికి సవరణలకు పూనుకుందన్నారు. కార్యక్రమంలో పాము బాలయ్య, సకిలే సూర్యనారాయణ, కె.లక్ష్మణరావు, పెయ్యల దుర్గాప్రసాద్, దుర్గబాబు తదితరులు పాల్గొన్నారు.

17 మోటారుసైకిళ్లు సీజ్

అమలాపురంరూరల్, జూలై 23(ఆంధ్రజ్యోతి): అమలాపురం కిమ్స్ వైద్య కళాశాల ప్రాంగణం వద్ద రవాణా శాఖాధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. హెల్మెట్ ధరించకుండా, డ్రైవింగ్ లైసెన్సు లేకుండా ఉన్న 17 మోటారు బైకులపై కేసులు నమోదు చేసి సీజ్ చేసినట్టు జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. ప్రతీ విద్యార్థి విధిగా డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని, హెల్మెట్ ధరించాలన్నారు. త్వరలోనే రహదారి భద్రతపై అన్ని కళాశాలల విద్యార్థులతో అవగాహన సదస్సులు నిర్వహిస్తామని డీటీవో శ్రీనివాసరావు తెలిపారు. తనిఖీల్లో మోటారు వెహికల్స్ ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, జ్యోతిసురేష్, కౌశిక్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇన్‌చార్జిగా బాబి నియామకం



అమలాపురం టౌన్, జూలై 23(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ కేకేసీ ఇన్‌చార్జిల నియామకంలో భాగంగా కాకినాడ, అనకాపల్లి జిల్లాల ఇన్‌చార్జిగా అమలాపురం కాంగ్రెస్ పట్టణ శాఖ అధ్యక్షుడు వంటెద్దు బాబిని నియమించారు. కేకేసీ జాతీయ అధ్యక్షుడు ఉదిత్‌రాజ్, పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి, కేకేసీ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటకృష్ణారెడ్డి బుధవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. కాంగ్రెస్ పార్టీకి సేవలు అందించిన వారిని గుర్తించి ఇన్‌చార్జిలుగా నియమించామన్నారు. ఈసందర్భంగా బాబిని నాయకులు జంగా గౌతమ్, జిల్లా అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొత్తూరి శ్రీనివాస్ తదితరులు అభినందించారు.

చెస్ పోటీల్లో విక్టరీ విద్యార్థుల ప్రతిభ

అమలాపురం టౌన్, జూలై 23(ఆంధ్రజ్యోతి): భీమవరంలో అంతర్జాతీయ చెస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రంధి వెంకటేశ్వరరావు మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలు నిర్వహించగా అమలాపురం విక్టరీ అకాడమీ విద్యార్థులు ప్రతిభ చాటారు. రాష్ట్రం నలుమూలల నుంచి 103మంది క్రీడాకారులు ఈపోటీల్లో పాల్గొన్నారు. విక్టరీ అకాడమీకి చెందిన సాధనాల శ్రీసంతోష్, బండారు నానిబాబు, ఫణిశెట్టి ధరణిలు రాష్ట్రస్థాయిలో 3, 4, 5 స్థానాలు సాధించినట్టు ప్రిన్సిపాల్ తాడి వెంకటసురేష్ తెలిపారు. తామరపు ప్రసన్న, వంగలపూడి శిరీష్‌గౌతమ్, జాన్‌బ్లెస్సీ, తటవర్తి అవ్యక్త ప్రత్యేక బహుమతులు సాధించారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

మామిడికుదురు, జూలై 23(ఆంధ్రజ్యోతి): భూయజమాని సంతకం అవసరం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరుతూ వినతిపత్రాన్ని బుధవారం తహశీల్దార్ సునీల్‌కుమార్‌కు అందించారు. ఎరువులు, పురుగుమందులు సబ్సిడీపై ఇవ్వాలని, కౌలు రైతులందరికీ రుణాలు చెల్లించాలని కోరారు. ఏపీ కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి పీతల రామచంద్రరావు, రైతులు తాటికాయల ఉదయభాస్కరరావు, సత్తి ధర్మారావు, తాటికాయల వెంకట్రావు, కడలి బాబూరావు, ఉచ్చుల సత్యనారాయణ, గంధం శ్రీను, రాయుడు ఆనందరావు పాల్గొన్నారు.

వీరేశ్వరస్వామికి లక్షపత్రి పూజ

ఐ.పోలవరం, జూలై 23(ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం ఆరుద్ర నక్షత్రం మాసశివరాత్రి సందర్భంగా బుధవారం మురమళ్ళ శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామికి లక్షపత్రి పూజ వైభవంగా నిర్వహించారు. కల్యాణ బ్రహ్మ నాగాభట్ల రామకృష్ణమూర్తి ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. అర్చకుడు పేటేటి శ్యామలకుమార్ ఆధ్వర్యంలో స్వామికి రుద్రహోమం నిర్వహించారు. సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మూడు రోజుల కార్యశాల

కాట్రేనికోన, జూలై23(ఆంధ్రజ్యోతి): చెయ్యేరు శ్రీశ్రీనివాసా అటానమస్ ఇంజనీరింగు కళాశాలలో కృత్రిమ మేధతో స్థిరీకరణ అంశంపై మూడు రోజుల కార్యశాల బుధవారం ప్రారంభమైంది. ఈకార్యశాలను కరస్పాండెంట్ డీవీఎస్ఎస్ వర్మ ప్రారంభించారు. విద్యార్థులకు కృత్రిమ మేధపై అవగాహన కోసం కార్యశాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ కార్యశాలను మైక్రోసాఫ్ట్ అనుబంధ సంస్థ ఐఎంబీఐ సమన్వయంతో నిర్వహిస్తున్నట్టు కంపెనీ సభ్యులు సాగర్ తెలిపారు. ప్రిన్సిపాల్ కె.సురేష్‌బాబు, విద్యాశాఖాధిపతులు వై.వెంకట్, రవికుమార్, కంప్యూటర్ ఇంజనీరింగ్ విభాగాధిపతి వి.సాయిప్రియ, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ పి.చైతన్య పాల్గొన్నారు.

కోకో రైతులకు ఉపాధి ద్వారా ప్రోత్సాహం

అంబాజీపేట, జూలై 23(ఆంధ్రజ్యోతి): కోకోసాగు చేపడుతున్న రైతులకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రోత్సాహన్ని అందిస్తామని అమలాపురం సహాయ పథక సంచాలకులు డి.రాంబాబు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏపీవో అడపా వెంకటశ్రీకృష్ణ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీడీ రాంబాబు మాట్లాడుతూ కోకో సాగు రైతులకు మొక్కకు రవాణతో కలిపి రూ.14.63 కొనుగోలు చేసి ప్రభుత్వం అందిస్తుందన్నారు. అంబాజీపేట మండలంలో కోకో ప్లాంటేషన్ కోసం 44మంది లబ్ధిదారులకు 74.25ఎకరాల్లో 12172 మొక్కలకు రూ.81,26,904 మంజూరు చేశామన్నారు. ఎకరాకు 200మొక్కలు వంతున రైతుకు మూడేళ్లకు రూ.1,59,133 ప్రభుత్వం తరపున అందిస్తామన్నారు. రైతులతో వెంటనే పనులు చేయించాలని సూచించారు. సమావేశంలో ప్లాంటేషన్ మేనేజర్ ఎం.త్రినాథ్, జేఈ పి.వెంకటేశ్వరరావు, టీఏలు ఉమా, దేవి, ఉపాధి హామీ క్షేత్రసహాయకులు పాల్గొన్నారు.

అల్లవరం ఎస్ఐగా సంపత్‌కుమార్



అల్లవరం, జూలై 23(ఆంధ్రజ్యోతి): అల్లవరం ఎస్ఐగా బి.సంపత్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అమలాపురం క్రైమ్ విభాగం నుంచి ఆయన ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ ఎస్ఐగా పని చేసిన టి.తిరుమలరావు హెడ్‌క్వార్టర్స్‌కు వీఆర్‌పై వెళ్లారు. శాంతిభద్రతల పర్యవేక్షణలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానని ఎస్ఐ సంపత్‌కుమార్ అన్నారు.

బాల్య వివాహాలు ప్రోత్సహించడం నేరం

కాట్రేనికోన, జూలై 23(ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలు చేసిన తల్లిదండ్రులు, సంరక్షకులు, స్నేహితులు, పురోహితులతో పాటు అనుమతి ఇచ్చిన కులపెద్దలు, సంబంధిత అధికారులు నేరస్తులేనని ముమ్మిడివరం సీడీపీవో నీహారిక హెచ్చరించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో సూపర్‌వైజర్ తులసి అధ్యక్షతన మండల స్థాయి చైల్డ్ వెల్ఫేర్ అండ్ ప్రొటెక్షన్ కమిటీ సమావేశం జరిగింది. బాల్యవివాహాలు జరుగుతున్నట్టు సమాచారం అందితే తక్షణమే గ్రామస్థాయిలో కారకులైన వారికి కోర్టు రూ.లక్ష జరిమానాతో పాటు రెండేళ్ల జైలు శిక్ష విధిస్తుందని ఆమె అన్నారు. లైంగిక వేధింపులపై అమలులో ఉన్న చట్టాలపై తహశీల్దార్ సుబ్బలక్ష్మి అవగాహన కల్పించారు. ఎంపీడీవో ఎస్వీ చలం పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీవో శ్రీనివాసరాజు, ఎంఈవో వెంకటరమణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఎల్.రమణి, తులసి, వీఆర్వోలు, యానిమేటర్లు తదితరులు పాల్గొన్నారు.

రూ.20లక్షలతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, లైన్

అంతర్వేది, జూలై 23(ఆంధ్రజ్యోతి): అంతర్వేది పల్లిపాలెం మినీ ఫిషింగ్ హార్బరుకు రూ.20లక్షలతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, లైన్‌ను వేయనున్నట్టు ఏడీ బీవీ కృష్ణరాజా తెలిపారు. ఇప్పటికే ప్రతిపాదనలు పంపించామని, మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు. 63కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు ప్రదేశాన్ని, స్ట్రీట్ లైట్ స్తంభాలకు సంబంధించి లైన్లను ఏఈ ప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. ఇప్పటికే కలెక్టర్ ఆదేశాల మేరకు హార్బరు పనులు శరవేగంగా జరుగుతున్నాయని, ప్రధానంగా విద్యుత్‌కు సంబంధించి నిధులు మంజూరైతే పనులు త్వరలో ప్రారంభిస్తామని ఏడీ తెలిపారు.

అయ్యప్ప ఆలయంలో అభిషేకాలు

మలికిపురం, జూలై 23(ఆంధ్రజ్యోతి): మలికిపురం ఎత్తు వంతెన వద్దనున్న హరిహరసుత అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం స్వామివారికి భక్తుల ఆధ్వర్యంలో పంచామృతాభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం స్వామివారికి పల్లకీసేవ జరిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

హరిహర వీరమల్లు విజయవంతం కావాలి



రాజోలు: తాటిపాక శ్రీలక్ష్మి థియేటర్ ఆవరణలో కేక్ కట్‌చేస్తున్న ఎమ్మెల్యేలు గిడ్డి సత్యనారాయణ, దేవ వరప్రసాద్

పి.గన్నవరం, జూలై 23(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నటించిన హరిహర వీరమల్లు చిత్రం విజయవంతం కావాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఆకాక్షించారు. పి.గన్నవరం గ్రామదేవత శ్రీతాటెమ్మ తల్లి ఆలయంలో స్థానిక జనసేన నాయకులతో కలిసి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చిత్రానికి సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. అదేవిధంగా పి.గన్నవరం త్రిరోడ్ సెంటర్లో చిత్రం విడుదల సందర్భంగా భారీ కేక్‌ను ఎమ్మెల్యే కట్ చేశారు.

అంబాజీపేట, (ఆంధ్రజ్యోతి): హరిహర వీరమల్లు చిత్రం అఖండ విజయం సాధిస్తుందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఆకాక్షించారు. అంబాజీపేట కొర్లపాటివారిపాలెంలో ఉన్న శ్రీభూసమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో చిత్ర పోస్టర్‌తో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అంతర్వేది, (ఆంధ్రజ్యోతి): హరిహర వీరమల్లు చిత్రంవిజయం సాధించి, చారిత్రాత్మక చిత్రంగా నిలుస్తుందని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. అంతర్వేదిపాలెం, వీవీమెరకశ్రీశంకర్ థియేటర్ల వద్ద కేక్‌నుకట్‌చేశారు.

ఎయిడెడ్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ముమ్మిడివరం, జూలై 23(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం రాజాకాక్‌షాట్ ఎయిడెడ్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్టు డాక్టర్ షేక్ సలీంబాషా ఒక ప్రకటనలో తెలిపారు. స్కూలు అసిస్టెంట్ 1(గణితం), స్కూలు అసిస్టెంట్ 1(తెలుగు), ఎస్జీటీ 2(తెలుగు) పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసినట్టు ఆయన తెలిపారు. అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఇతర వివరాలకు సీపీసీఈ వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

తపాలా శాఖలో ఏజెంట్ల నియామకానికి ఇంటర్వ్యూలు

అమలాపురం టౌన్, జూలై 23(ఆంధ్రజ్యోతి): తపాలాశాఖలో డైరెక్ట్ ఏజెంట్ల నియామకానికి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు అమలాపురం డివిజన్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్స్ ఆర్.నవీన్‌కుమార్ తెలిపారు. తపాలా జీవితబీమా డైరెక్ట్ ఏజెంట్లను అమలాపురం డివిజన్‌కు నియమించనున్నారు. ఈనెల25న అమలాపురం సూపరింటెండెంట్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. ఇంటర్వ్యూలు తర్వాత కూడా 31వరకు దరఖాస్తుదారులు ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరుకావచ్చన్నారు. 18ఏళ్లు నిండి పదో తరగతి ఉత్తీర్ణులవ్వాలన్నారు. నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ రూపంలో రూ.5వేలువిలువైన డిపాజిట్‌ను చెల్లించాలన్నారు. ఏజెంట్లు వారు చేసిన బిజినెస్ ఆధారంగా ప్రోత్సాహక గౌరవవేతనం, కమీషన్ పొందవచ్చన్నారు. వివరాలకుసెల్: 9494928199ను సంప్రదించాలన్నారు.

మొండి బకాయిల వసూళ్లకు టీమ్స్

రాజోలు, జూలై 23(ఆంధ్రజ్యోతి): డీసీసీ బ్యాంకు శాఖలో సహకార సంఘాల ద్వారా ఇచ్చిన కొన్ని రుణాలు, వాయిదా మీరి నిర్ధారక ఆస్తులుగా మారడంతో నాబార్డు, ఆప్కాబ్ సూచనల ప్రకారం రికవరీ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా డీసీసీబీ బ్యాంకు అధికారులు సహకార సంఘ సీఈవోలు, సిబ్బంది ప్రత్యేక టీములుగా ఏర్పడి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న మొండి బకాయిలు వసూలు చేస్తున్నామని డీసీసీ బ్యాంకు ఏజీఎం రమేష్ బుధవారం తెలిపారు. ఈసందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజోలు డీసీసీ బ్యాంకు పరిధిలోని చింతలపల్లి, పోతుమట్ల , కూనవరం గ్రామాల్లో మొండి బకాయిదారుల వద్దకు వెళ్లి వినూత్న రీతిలో నిరసన తెలియజేసి మొండి బకాయిల వసూలు కోసం ప్రణాళికలు చేశామని తెలిపారు. మొండి బకాయిల వసూళ్లలో భాగంగా తదుపరి చర్యగా బకాయిలు వసూలు కానివారి భూములు వేలం వేయడానికి తగిన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ ఎం.స్టీఫెన్‌పాల్, సూపర్‌వైజర్ పి.ప్రవల్లిక, సీఈవోలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాట్రేనికోన, జూలై 23(ఆంధ్రజ్యోతి): పల్లంకుర్రులో నిర్మిస్తున్న నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు అమలాపురం ట్రాన్స్ కో ఈఈ కె.రాంబాబు తెలిపారు. పల్లంకుర్రు, బలుసుతిప్ప, కందికుప్ప, కుండలేశ్వరం, నడవపల్లి, గెద్దనపల్లి, మొల్లేటిమొగ, దొంతికుర్రు, కొప్పిగుంట గ్రామాలకు సరఫరా ఉండదన్నారు.

ముమ్మిడివరం, (ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం సబ్‌స్టేషన్ పరిధిలోని కొత్తలంక బ్రేకర్ ఏర్పాటుచేయడం, మెయింటినెన్స్ కోసం శుక్రవారం ఉదయం 8నుంచి 2గంటల వరకు ముమ్మిడివరం మండలమంతా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.రాంబాబు తెలిపారు.

మహేష్‌పై దాడిచేసిన వారిపై అట్రాసిటీ కేసు పెట్టాలి

ముమ్మిడివరం, జూలై 23(ఆంధ్రజ్యోతి): అయినవిల్లి మండలం వెలువలపల్లి గ్రామానికి చెందిన దోనిపాటి మహేష్‌పై దాడిచేసిన వారిపై అట్రాసిటీ, హత్యాయత్నంగా కేసులు నమోదుచేసి కఠినంగా శిక్షించాలని కేవీపీఎస్ మండల సమావేశం డిమాండ్ చేసింది. ముమ్మిడివరం మండల సీఐటీయూ కార్యాలయంలో యలమంచిలి బాలరాజు అధ్యక్షతన బుధవారం కేవీపీఎస్ సమావేశం జరిగింది. జిల్లా గౌరవాధ్యక్షుడు జి.దుర్గాప్రసాద్ పాల్గొని మాట్లాడారు. మహేష్‌కు మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. ఇటీవల కాలంలో జిల్లాలో దళితులు, బలహీనవర్గాలపైనా దాడులు పెరిగిపోతున్నాయన్నారు. మహేష్, వారి కుటుంబాన్ని ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకోవాలన్నారు. సమావేశంలో ఎస్.నారాయణ, ఇ.బాలయ్య, డి.వీరరాఘవులు, నక్కా అరుణ్‌కుమార్, ఎన్.వెంకటేష్, కె.లక్ష్మణ్ పాల్గొన్నారు.

లైన్‌మెన్ మృతి

మామిడికుదురు, జూలై 23(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి గ్రామ లైన్‌మెన్ బిళ్ల ఆనందరావు(46) విధి నిర్వహణలో అనారోగ్యానికి గురై బుధవారం మృతిచెందారు. ఆదివారం రాత్రి అప్పనపల్లి గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పునరుద్ధరించడానికి వెళ్తూ పాశర్లపూడి ఏటిగట్టు సమీపంలో పడిపోయారని, అతడిని తోటి లైన్‌మెన్ అమలాపురం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అతను బుధవారం మృతిచెందినట్టు తెలిపారు. కొంత కాలంగా అతడు అనారోగ్యంతో బాధపడుతున్నారని స్థానికుల సమాచారం. మృతిచెందిన లైన్‌మెన్ కుటుంబ సభ్యులను విద్యుత్‌శాఖ ఉద్యోగులు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.



సోమేశ్వర స్వామికి లక్ష పత్రి పూజ చేస్తున్న దృశ్యం

వెంటూరులో మాస శివరాత్రి పూజలు

రాయవరం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంటూరు పార్వతీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో మాస శివరాత్రి పూజలను బుధవారం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి వివిధ రకాల ద్రవ్యాలతో అభిషేకాలు, లక్షపత్రి పూజ, పార్వతి అమ్మవారికి కుంకుమార్చన, సూర్యనమస్కారాలు, లింగార్చన జరిపారు. మద్దిరాల లక్ష్మణరావు-పద్మావతి దంపతులు అన్నసమారాధన చేశారు. టి.రామవరజు, డి.రామారావు, మోహన్, బి.మూర్తి, పీవీఎస్ మూర్తి, వింజమూరి సుబ్రహ్మణ్యం, భక్తులు పాల్గొన్నారు.



పామర్రులో జరిగిన 'పొలం పిలుస్తోంది'లో రైతులకు సూచనలు చేస్తున్న ఏడీ నాగకుమార్

రూ.80తో ఎకరాకు 'పంటల భీమా'

కె.గంగవరం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకంలో రూ.80 చెల్లిస్తే ఎకరాకు పంటల బీమా వర్తిస్తుందని వ్యవసాయ శాఖ రామచంద్రపురం డివిజన్ సహాయ సంచాలకుడు బి.నాగకుమార్ అన్నారు. మండల వ్యవసాయ శాఖ అధికారి సద్గురు మూర్తి ఆధ్వర్యంలో బుధవారం పామర్రు, యండగండి గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన నాగకుమార్ రైతులకు పలు సూచనలు చేశారు. ఖరీఫ్ పంట నమోదు ప్రక్రియ ప్రారంభమైందని ప్రతి రైతు తమ పంటలను రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని కోరారు. ఎకరాకు రూ.80 చెల్లించి పంటల భీమా నమోదు చేయించుకోవాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో కార్యదర్శి సీతారామయ్య, కూటమి నాయకులు మరిశాద సూరిబాబు, దేవరపల్లి వెంకటేశ్వరరావు, గ్రామ ప్రముఖులు వాసంశెట్టి సూరిబాబు, సాదే కపిల్, రైతులు పాల్గొన్నారు.

'ఎన్నికల హామీలను విస్మరించిన కూటమి ప్రభుత్వం'

రాయవరం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం విస్మరించి ప్రజలను మోసగించిందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండలంలోని పసలపూడిలో బుధవారం 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న ఎమ్మెల్సీ మాట్లాడుతూ పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా ప్రభుత్వం హామీలను తుంగలోకి తొక్కిందని ఆరోపించారు. రానున్న రోజుల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం హామీలను ఏ విధంగా అమలు చేయలేదో వివరిస్తామన్నారు. సమావేశంలో ఎంపీపీ నౌదు వెంకటరమణ, వైసీపీ మండల కన్వీనర్ వీవీవీ సత్యనారాయణరెడ్డి, సిరిపురపు శ్రీనివాసరావు, చింతా సుబ్బారెడ్డి, సర్పంచ్ కడలి పద్మావతి, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎట్టకేలకు మోక్షం

అసంపూర్తిగా నిలిచిపోయిన కల్యాణ మండపానికి నిధులు

రూ.30లక్షలు మంజూరు చేసిన ఎంపీ ఆర్.కృష్ణయ్య

సర్పంచ్ సంగీత సుభాష్ కృషిని అభినందిస్తున్న గ్రామస్థులు



పినపళ్లలో అసంపూర్తిగా నిలిచిపోయిన కల్యాణ మండపం

ఆలమూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పినపళ్లలో దాదాపు 15 ఏళ్లగా అసంపూర్తిగా నిలిచిపోయిన కల్యాణ మండపానికి ఎట్టకేలకు మోక్షం కలగనుంది. దీనికి త్వరలో మహర్దశ పట్టనుంది. మాజీ మంత్రి సంగిత వెంకటరెడ్డి ఆశయాన్ని తాను నెరవేర్చుతానని సర్పంచ్ సంగిత సుభాష్ ముందు కొచ్చి నిధుల సాధనకు కృషి చేశారు. కల్యాణ మండపం దుస్థితిని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్యకు వివరించగా ఆయన తన నిధుల నుంచి రూ.30లక్షలు మంజూరు చేశారు. మంజూరు పత్రాలను కలెక్టర్‌కు అందించి ఆమోదం వచ్చేలా చేశారని సర్పంచ్ తెలిపారు. దీంతో గ్రామస్థులకల నెరవేరబోతోందన్నారు. ఎంపీ నిధులు మంజూరు చేసేలా సహకరించిన నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ



రామచంద్రపురం (ద్రాక్షారామ), జూలై 23 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం పట్టణం, మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను ఆర్డీవో దేవరకొండ అఖిల బుధవారం తనిఖీ చేశారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌లో భాగంగా పట్టణంలోని కృత్తివెంటి పేర్రాజుపంతులు జూనియర్ కళాశాల, కొత్తూరు, విల్లా వారి వీధి మున్సిపల్ పాఠశాలలు, రామచంద్రపురం మండలంలోని తోటపేట, వేగాయమ్మపేట పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఆర్డీవో వెంట తహసీల్దారు ముత్యంజయరావు ఉన్నారు.

వంతెనల శుభ్రం

కె.గంగవరం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాణింగపల్లి, సత్యవాడ, గంగవరం తదితర గ్రామాల్లో ఆర్అండ్‌బీ రహదారుల పరిధిలోని వంతెనలను శుభ్రం చేస్తున్నారు. ప్రస్తుతం వంతెనల గోడల వద్ద బురద పేరుకుపోయింది. కొన్నిచోట్ల పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. బురదతో వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఆర్అండ్‌బీ అధికారులు జంగిల్ క్లియరెన్స్‌తో పాటు వంతెనలకు ఇరువైపులా పేరుకుపోయిన మట్టిని ఎక్స్‌కవేటర్లతో తొలగించేస్తున్నారు.



రక్తదానం చేస్తున్న డిగ్రీ విద్యార్థులు

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రక్తదాన శిబిరం

రామచంద్రపురం (ద్రాక్షారామ), జూలై 23 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ రామకృష్ణ, ఏరియా ఆసుపత్రి వైద్యులు డాక్టర్ ప్రసాద్, డాక్టర్ ఎస్.సునీత పర్యవేక్షణలో విద్యార్థులు, అధ్యాపకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సంస్థ కన్వీనర్ కె.శ్రీదేవి, వైస్ ప్రిన్సిపాల్ పద్మజ, డాక్టర్ రమణ, డాక్టర్ ఎస్.సుజాత, షహజాది బేగం తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలకు రాయితీపై సోలార్ యూనిట్లు

ఆలమూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): సోలార్ విద్యుత్ యూనిట్లను ఎస్సీ, ఎస్టీలకు పూర్తి రాయితీతో అందిస్తున్నట్టు ఎంపీడీవో ఎ.రాజు, ట్రాన్స్‌కో ఏఈ దుర్గాప్రసాద్ తెలిపారు. బుధవారం వారు ఆలమూరు ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు సోలార్ యూనిట్ల ఏర్పాటుపై అవగాహన కల్పించారు. సోలార్ యూనిట్లు ఏర్పాటు చేసుకోవాలనుకునే వారికి నూరు శాతం రాయితీ ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వాయిదా మిగిలిన విద్యుత్‌ను విద్యుత్ శాఖకు అమ్ముకోవచ్చన్నారు. ట్రాన్స్‌కో ఎల్ఐ సత్యనారాయణ, లైన్‌మెన్ గంటి శ్రీనివాస్, టీడీపీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు సాలి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఎస్సీ కాలనీలో సోలార్ విద్యుత్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కె.గంగవరం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కె.గంగవరం సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ రామచంద్రపురం డీఈ కె.రత్నాలరావు, కె.గంగవరం ఏఈ భాస్కర్ తెలిపారు. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు గంగవరం, సత్యవాడ, తామరపల్లి, కుందూరు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని వారు చెప్పారు.

ఎయిడెడ్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ముమ్మిడివరం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురంలోని రాజా కాక్స్‌ఫాట్ ఎయిడెడ్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్టు డాక్టర్ షేక్ సలీం బాషా తెలిపారు. ఈ విషయాన్ని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కూలు అసిస్టెంట్-1 (గణితం), స్కూలు అసిస్టెంట్-1 (తెలుగు), ఎస్జీటీ-2 (తెలుగు) పోస్టులకు ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు సీఎస్ఈ వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

చంద్రశేఖర్ ఆజాద్ జయంతి

రామచంద్రపురం (ద్రాక్షారామ), జూలై 23 (ఆంధ్రజ్యోతి): చంద్రశేఖర్ ఆజాద్ 119వ జయంతిని పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆజాద్ చిత్రపటానికి బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు పిల్లి మురళి, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధూ పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ నగర్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ద్రాక్షారామకు చెందిన శంకరనారాయణ బుక్ స్టాల్, రామచంద్రపురానికి చెందిన లావణ్య బుక్ స్టాల్, ఆరోగ్యలక్ష్మి మెడికల్ షాపు సౌజన్యంతో పుస్తకాలు ఉచితంగా పంపిణీ చేశారు. పీడీఎస్‌యూ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభం ఏర్పాటుపై ఫిర్యాదు

ఆలమూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదపళ్ల ఒకటో వార్డులో వేసిన విద్యుత్ స్తంభంపై స్థానికులు ట్రాన్స్‌కో అధికారులకు ఫిర్యాదు చేశారు. అసలే ఇరుకు రహదారి, ఆపై విద్యుత్ స్తంభం ఏర్పాటుతో లోపలికి వాహనాలు వెళ్లే మార్గం ఉండదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఉన్న స్తంభాన్ని తొలగించి అక్కడే ఏర్పాటుచేస్తే ఇబ్బంది ఉండదన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని విద్యుత్ స్తంభాన్ని మార్పు చేయాలని కోరారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ద్రాక్షారామ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం జగన్నాయకులపాలెం వద్ద మంగళవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని తోటపేటకు చెందిన వనుం కృష్ణ (48) మృతి చెందారు. ద్రాక్షారామ ఎస్ఐ ఎం.లక్ష్మణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కందలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అద్భుత ఫలితాలు

ఆత్రేయపురం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కంద పంట సాగు చేసే రైతులు యాజమాన్య పద్ధతులు అవలంబిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని భారత దుంప పంటల పరిశోధన సంస్థ డైరెక్టర్ డాక్టర్ జి.బైజు పేర్కొన్నారు. బుధవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ఉచ్చిలిలో ప్రాంతీయ ఉద్యాన పరిశోధన స్థానం, కొవ్వూరు ఉద్యాన శాఖ సంయుక్త ఆధ్వర్యంలో దుంప పంటల సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. అఖిల భారత దుంప పంటల పరిశోధన పథకానికి చెందిన శాస్త్రవేత్తలు సదస్సులో పాల్గొని కంద సాగులో అనుసరించాల్సిన యాజమాన్య పద్ధతులు వివరించారు. మారుతున్న వాతావరణంలో పంటపై వచ్చే తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఉద్యాన పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ డి.వెంకటస్వామి మాట్లాడుతూ వాతావరణంలో ఏర్పడే స్థితిగతులపై ఎప్పటికప్పుడు శాస్త్రవేత్తలను సంప్రదించడంతో పాటు దుంప పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మమత, డాక్టర్ శివకుమార్ రైతులతో ముఖాముఖి చర్చల్లో పాల్గొన్నారు. ఉద్యాన శాఖాధికారి కోటేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఉద్యాన రైతులకు అందిస్తున్న పథకాలను వివరించారు. అభ్యుదయ రైతులు భూపతిరాజు బలరామరాజు, సుబ్బరాజు, సూర్యప్రకాశ్, వెంకటేశ్వరరావు, ఉద్యాన శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



ఉచ్చిలిలో దుంప పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తల బృందం

వాడపల్లి వెంకన్న ఆదాయం రూ.3.17లక్షలు

ఆత్రేయపురం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామిని బుధవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. నోము ఆచరించిన అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు నిర్వహించుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా ఆదాయం రూ.3,17,802 వచ్చింది.

సౌకర్యాల పెంపుదలకు చర్యలు..

ప్రతీ శనివారం భక్తుల రద్దీకి అనుగుణంగా సౌకర్యాలను మెరుగుపరిచే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. రూ.200, రూ.50, ఉచిత క్యూలైన్ల వద్ద భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా టాయిలెట్లు ఏర్పాటు చేస్తున్నారు. ఆలయంలో లోపల ప్రధాన ద్వారం మార్గం వద్ద ద్వారాలను వెడల్పు చేసే పనులను చేపట్టారు. ఈపనులను ఉపకమిషనర్ సూర్యచక్రధరరావు పరిశీలించారు. గురువారం ఉదయం హుండీ కానుకలు లెక్కింపు నిర్వహిస్తున్నట్టు ఈవో తెలిపారు.

ఆత్రేయపురం సొసైటీ చైర్మన్‌గా రామభద్రరాజు



ఆత్రేయపురం సొసైటీ త్రిసభ్య కమిటీ ప్రమాణస్వీకారం చేసిన దృశ్యం

ఆత్రేయపురం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ బుధవారం కొలువుతీరింది. అధ్యక్షుడిగా ముదునూరి రామభద్రరాజు, సభ్యులుగా కట్టా అనూరామ్, కలిదిండి వెంకట్రావు ప్రమాణస్వీకారం చేశారు. కూటమి శ్రేణులు ఊరేగింపుగా తరలివచ్చారు. త్రిసభ్య కమిటీ సభ్యులను టీడీపీ మండల అధ్యక్షుడు కనుసుమిల్లి రామకృష్ణంరాజు, సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్‌చైర్మన్ కరుటూరి నరసింహారావు, కస్టర్ ఇన్‌చార్జులు ముదునూరి వెంకట్రాజు, ముళ్లపూడి భాస్కరరావు, మాజీ సమితి అధ్యక్షుడు మద్దూరి సుబ్బారావు, మాజీ ఎంపీపీ పీఎస్ రాజు, డీసీసీబీ డైరెక్టర్ అభినందించారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మండపేట, జూలై 23 (ఆంధ్రజ్యోతి): 11కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతుల కోసం విద్యుత్ సరఫరా అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఇంజనీర్ కె.రత్నాలరావు తెలిపారు. ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలోని ద్వారపూడి, కేశవరం, ఇప్పనపాడు గ్రామాలకు శుక్రవారం ఉదయం 8.30 నుంచి ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

కిసాన్ డ్రోన్లతో రైతులకు ఎంతోమేలు



పొలంబడిలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు

కొత్తపేట, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా రైతులు కిసాన్ డ్రోన్లతో పిచికారి చేస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు అన్నారు. బుధవారం పలివెలలో జరిగిన పొలంబడి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులు టెక్నాలజీని అందిపుచ్చుకోవాలన్నారు. కోనసీమ జిల్లాలో 22 మండలాల్లోను కిసాన్ డ్రోన్ల వినియోగంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రతి రైతు పొలంలో పైరుకు యూరియా, డీఏపీ బస్తాలుగా తెచ్చుకుని చల్లుకోవడం జరిగేది. దానికి బదులుగా నానో డీఏపీ, నానో యూరియా లిక్విడ్ రూపంలో అందుబాటులో ఉన్నాయని, ఎకరానికి పిచికారికి రూ.350ఖర్చుతో సమయం, డబ్బు ఆదా అవుతాయన్నారు. ఇవి లిక్విడ్ రూపంలో ఉండటం వల్ల డ్రోన్లతో పది నిమిషాల వ్యవధిలో ఎకరం పిచికారీ పూర్తి అవుతుందన్నారు. ఇటువంటి అవకాశాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పొలంబడి ద్వారా మారుతున్న టెక్నాలజీని రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. డ్రోన్లను రైతులు సద్వినియోగం చేసుకుని అధిక దిగుబడులు సాధించుకోవాలన్నారు. కొత్తపేట ఏడీఏ ఎంపీ రామారావు, ఏవో దేవికారాణి, ఆర్ఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం పరుగు : ఎమ్మెల్యే వేగుళ్ల



సంక్షేమ పథకాల కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు

మండపేట, జూలై23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత వైసీపీ ఆరాచక పాలన భరించలేని ప్రజలు ఆ పార్టీని 11సీట్లకే పరిమితం చేసి రాష్ట్రంలో కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టారని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. మండపేట పట్టణం 23వార్డుల్లో బుధవారం ఆయన స్థానిక నేతలతో కలిసి సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. సుపరిపాలన అందిస్తుందని ప్రజలు భావించి కూటమికి 164 సీట్లు ఇచ్చారన్నారు. ప్రజలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏడాదిలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు కరపత్రాల ద్వారా వివరించారు. కూటమి ప్రభుత్వంపై వైసీపీ నాయకులు చేస్తున్న ఆరోపణలు సత్య దూరమన్నారు. సీఎం చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ సారథ్యంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెడుతుందన్నారు. స్థానిక నేతలు మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాశ్, ఉంగరాల రాంబాబు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు మచ్చా నాగు, కాళ్లకూరి శ్రీనివాస్, కౌన్సిలర్ యరమాటి గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఎలక్ట్రికల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మండపేట లేబర్ అధికారి నాగేశ్వరరావు

మండపేట, జూలై 23(ఆంధ్రజ్యోతి): మండపేట నియోజకవర్గంలో ఉన్న ఎలక్ట్రికల్, ప్లంబింగ్ వర్కర్లతో కార్మికశాఖ అధికారి శివనాగేశ్వరరావు బుధవారం ఆలమూరు రోడ్డులో ఉన్న యేకుల సత్యనారాయణ కల్యాణ మండపంలో సమావేశం నిర్వహించారు. కార్మిక శాఖ ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఆయన వివరించారు. కార్మికులు తప్పని సరిగా ఈశ్రమదాన్ కార్డు పొందాలన్నారు. కార్మికులు గుర్తింపు కార్డులను రెన్యువల్ చేయించుకోవాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు కట్టా వెంకటరమణ మాట్లాడుతూ ప్రభుత్వ స్థాయిలో ప్లంబర్, ఎలక్ట్రికల్ కార్మికులు కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని వైసీపీ కార్మిక విభాగం రాష్ట్ర కార్యదర్శి కెల్లి నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం నాగేశ్వరరావును సహచర కార్మికులు అభినందించారు. కార్యక్రమంలో నియోజకవర్గ నలుమూలల నుంచి తరలివచ్చిన కార్మికులు పాల్గొన్నారు.

నేతల చిత్రపటాలకు నివాళి

మండపేట, జూలై23(ఆంధ్రజ్యోతి): ద్వారపూడి జిల్లాపరిషత్ బాలికల హైస్కూల్లో బుధవారం బాలగంగాధర్‌తిలక్, చంద్రశేఖర్ ఆజాద్ జయంతి వేడుకలను నిర్వహించారు. దేశ కోసం శ్రమించిన నేతలు నేటితరానికి స్ఫూర్తి అని ఉపాధ్యాయులు అన్నారు. వారి చిత్రపటాలకు నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆకుల రామకృష్ణ పుట్టినరోజు వేడుకలు



శుభాకాంక్షలు తెలుపుతున్న అభిమానులు

రాఘవపాలెం, జూలై 23(ఆంధ్రజ్యోతి): తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, అనపర్తి నియోజకవర్గ పరిశీలకులు ఆకుల రామకృష్ణ పుట్టినరోజు వేడుకలను పార్టీ శ్రేణులు, ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. గోపాలపురంలోని రామకృష్ణ నివాసానికి నాయకులు, అభిమానులు పెద్దఎత్తున చేరుకుని కేక్ కట్ చేశారు.

ద్వారపూడిలో గుర్తుతెలియని మృతదేహం

మండపేట, జూలై 23(ఆంధ్రజ్యోతి): ద్వారపూడి కెనాల్ రోడ్డు పాత లారీ యూనియన్ ఆఫీసు ఎదుట 35నుంచి 50ఏళ్ల వయస్సు గల గుర్తుతెలియని మృతదేహాన్ని గుర్తించామని మండపేట రూరల్ పోలీసులు తెలిపారు. వివరాల కోసం ఆతడి మృతదేహాన్ని మండపేట ప్రభుత్వాసుపత్రిలో 72 గంటలు ఉంచుతామని పోలీసులు తెలిపారు. వివరాలకు సెల్: 9440796592, 9440796537 నెంబర్లను సంప్రదించాలన్నారు.

సోలార్ విద్యుత్‌ను వినియోగించుకోవాలి

మండపేట, జూలై 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సబ్సిడీపై అందించే సోలార్ సిస్టమ్‌ను ప్రతి ఇంటి యజమాని ఏర్పాటు చేసుకోవడం ద్వారా విద్యుత్ బిల్లు ఆదాతో పాటు సోలార్ ద్వారా వచ్చే విద్యుత్‌ను విక్రయించడం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని మున్సిపల్ కమిషనర్ టి.వి.రంగారావు అన్నారు. మండపేటలో బుధవారం మున్సిపల్, సచివాలయ ఉద్యోగులతో ఆయన సోలార్‌సిస్టమ్‌పై సమావేశం నిర్వహించారు.

ధూపదీప నైవేద్యాలకు ఆర్థిక సాయం : ఎమ్మెల్యే



ఎమ్మెల్యే బండారు

కొత్తపేట, జూలై 23(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో పలు దేవాలయాలకు దేవాదాయ శాఖ ద్వారా ధూపదీప నైవేద్య పథకం కింద ఆర్థిక సాయం మంజూరైందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. ఈసందర్భంగా వాడపాలెంలో ఆయన మాట్లాడుతూ చాలా దేవాలయాల్లో ఆదాయ వనరులు తక్కువగా ఉండటం వల్ల నిత్య ధూపదీప నైవేద్య కార్యక్రమాలకు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ప్రభుత్వం అక్కడ సేవలు నిర్వహిస్తున్న అర్చకులకు ఆర్థిక స్వాలంబన కల్పించేందుకు ధూపదీప నైవేద్య పథకం కింద దేవాలయానికి నెలకు రూ.10వేలు వంతున మంజూరయ్యాయన్నారు. దీనికి సంబంధించి కొత్తపేట మండలంలో వాడపాలెం కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం, కమ్మిరెడ్డిపాలెం తాళ్లమ్మ అమ్మవారి ఆలయం, శ్రీరామ సత్యనారాయణస్వామి ఆలయం, వానపల్లి శ్రీవల్లీదేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం, శ్రీబాలబాలాజీ వెంకటేశ్వరస్వామి ఆలయం, కొత్తపేట బంగారమ్మ అమ్మవారి ఆలయాలకు మొదటి దశలో నిధులు మంజూరయ్యాయని మిగిలిన ఆలయాలకు మలి విడతలో ఆర్థిక సాయం దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ద్వారా చేయనున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి రామనారాయణరెడ్డికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

ఫొటోగ్రాఫర్లు ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకోవాలి



ఫొటోగ్రాఫర్ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న ఫొటోగ్రాఫర్ సంఘ జిల్లా నాయకులు

మండపేట, జూలై 23(ఆంధ్రజ్యోతి): మారుతున్న కాలంతో పాటు ఫొటోగ్రాఫర్లు ఆధునిక సాంకేతికతను అలవాటు చేసుకోవాలని ఫొటోగ్రాఫర్స్ సంఘ జిల్లా అధ్యక్షుడు సురేష్ పిలుపు నిచ్చారు. స్థానిక బ్రాహ్మణ సత్రంలో బుధవారం జిల్లాలో 19 మండలాలకు చెందిన ఫొటోగ్రాఫర్ల సమావేశం జరిగింది. సమావేశంలో ఫొటోగ్రాఫర్లు ఎదుర్కొంటున్న సమస్యలు గురించి చర్చించారు. ఫొటోగ్రాఫర్ల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లాలని నిర్ణయించారు. మండపేటకు చెందిన ఫొటోగ్రాఫర్ ఇటీవల లేబరు కుటుంబానికి సంఘం తరఫున రూ.80వేలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు రామారెడ్డి, సంఘ నాయకులు ఎస్.వీ.రావు, దొరబాబు, వెంకటేష్, మనోజ్, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

మండపేట, జూలై 23(ఆంధ్రజ్యోతి): స్థానిక టీడీపీ కార్యాలయంలో సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన ఆర్థిక సాయం చెక్కులను ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు బుధవారం లబ్ధిదారులు 28మందికి రూ.20,36,260 చెక్కులను అందజేశారు. వైద్యం కోసం సహాయం మంజూరు చేయించిన ఎమ్మెల్యే వేగుళ్లకు వారు ధన్యవాదాలు తెలిపారు. మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాశ్, నల్లమిల్లి వీరెడ్డి, నేతలు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆండాళ్ అమ్మవారి తిరునక్షత్ర ఉత్సవాలు

ఆత్రేయపురం, జూలై 23(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల24 నుంచి 28వరకు ఆండాళ్ అమ్మవారి తిరునక్షత్ర ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉదయం ఆండాళ్ అమ్మవారి సన్నిధిలో ద్రవిడ వేదపారాయణం, సాయంత్రం ప్రాకారోత్సవం, తీర్థప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రతి ఏటా మాదిరిగానే ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఈవో చక్రధరరావు తెలిపారు. ఈఉత్సవానికి సంబంధించి ఏర్పాట్లు చేపట్టామన్నారు.